ప్రజాశక్తి

బుధవారం 7 ఆగస్టు 2024 8 పేజీలు

గుంటూరు పల్నాడు

చాలా కాలనికి వరి

- సాగర్ ఆయకట్టులో సాగుకు అనుమతి - రైతుల్లో ఉత్సాహం
- 1.70 లక్షల ఎకరాల్లో సాగుకు ఛాన్సు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

సాగర్ ఆయకట్టు పరిధిలో ఈ ఏడాది ఎట్టకేలకు వరి సాగుకు అనుమతిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. చాలా కాలం తరువాత ఖరీఫ్ సీజన్‌లో వరికి అనుమతి రావడంతో రైతులు ఆనందంతో ఉన్నారు. ఈ ఏడాది ఆగస్టు మొదటి వారంలోనే సాగర్ జలాశయం పూర్తిగా నిండి లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల కావడంతో ఆయకట్టు పరిధిలోని పల్నాడు జిల్లాలో వరి సాగుకు రైతులను సన్నద్ధం చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. వర్షాలు ఆశాజనకంగా ఉండటం, సాగర్ జలాశయంకు నీరు సమృద్ధిగా రావడం వల్ల కాల్వలకు పుష్కలంగా నీరు రావడం వల్ల రైతులు నారుముళ్ల పోసుకుంటున్నారు.

జిల్లాలో సాధారణ విస్తీర్ణం 1.06 లక్షల ఎకరాల్లో వరి సాగు అవుతుందని అంచనా వేయగా ఈ సారి 1.25 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. సాగర్ ఆయకట్టు పరిధిలోని తాడికొండ, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లోని వివిధ మేజర్ల కింద మరో 20 వేల ఎకరాల్లో వరి సాగు జరగనుంది. ఉమ్మడి జిల్లాకు ఈ ఏడాది 90 టిఎంసీల నీరు వినియోగించుకునేందుకు అవకాశం ఉంది. ఇప్పటి వరకు దాదాపు 10 టిఎంసిలు గోదావరి జలాలు పట్టిసీమ ద్వారా కృష్ణాడెల్టాకు అందించారు. ఈనేపథ్యంలో సాగర్ ఆయకట్టు పరిధిలోని వివిధ మండలాలకు కాల్వలకు పూర్తిస్థాయిలో నీటి సరఫరా జరుగుతోంది. మరో వైపు జిల్లాలో పత్తి విస్తీర్ణం కూడా గణనీయంగా పెరగనుంది. పల్నాడు జిల్లాలో సాధారణ విస్తీర్ణం 2.65 లక్షల ఎకరాలు కాగా ఇప్పటి వరకు 1.35 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరిగింది. నాగార్జున సాగర్ జలాశయంకు నీరు వస్తుండటంతో ఈ ఏడాది మిర్చి సాగు పెరగనుంది. గుంటూరు,పల్నాడు జిల్లాల్లో గత ఏడాది 1.40 లక్షల ఎకరాల్లో మిర్చి సాగు జరగ్గా ఈఏడాది 1.80 లక్షల ఎకరాల్లో మిర్చి సాగు జరగవచ్చునని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం మిర్చి ధర కొంత తక్కువగా ఉన్నా కనీస ధర రూ.10వేలుకు తగ్గకపోవడం వల్ల మిర్చి సాగు లాభదాయకంగా ఉంటుందని భావిస్తున్నారు.కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలోని పొన్నూరు, మంగళగిరి, తెనాలి నియోజకవర్గాల్లోని కాల్వలకు కూడా ప్రస్తుతం ప్రకాశం బ్యారేజి నుంచి దాదాపు 11 వేల క్యూసెక్కుల నీరు రావడంతో వరి సాగు ముమ్మరంగా సాగుతోంది. లక్ష ఎకరాల్లో వరి వెదపద్ధతిలోసాగు చేయగా మరో 25 వేల ఎకరాల్లో నాట్లు పద్ధతిలో సాగు చేశారు. మొత్తం 1.64 లక్షల ఎకరాలకు గాను లక్ష ఎకరాల్లో సాగు పూర్తయింది. జిల్లాలో 68 వేల ఎకరాల్లో పత్తి సాగు అవుతుందని అంచనా వేయగా 50 వేల ఎకరాల్లో సాగు చేశారు. 52 వేల ఎకరాల్లో మిర్చి సాగు జరుగుతుందని అంచనా వేయగా ఇప్పటి వరకు కేవలం 8 వేల ఎకరాల్లోనే మిర్చి వేశారు.మినుము, పెసర, పసుపు తదితర పంటలు మొత్తంగా 10 వేల ఎకరాల్లో సాగు జరిగింది. ప్రస్తుతం నీటి ఎద్దడి తొలగిపోవడం వల్ల గుంటూరు,పల్నాడు జిల్లాలో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మరో వైపు కృష్ణా పరివాహక ప్రాంత మండలాల్లో మాత్రం ఇప్పటికే సాగు చేసినపైర్లకు ముంపు బెడద పొంచి ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు

చుండూరు దళిత మృతవీరులకు నివాళి

ప్రజాశక్తి - మంగళగిరి

చుండూరు మృత వీరులకు స్థానిక కొత్త బస్టాండ్ వెనుక గల ఎస్సీ, ఎస్టీ రైట్స్ అండ్ యాక్ట్ రాష్ట్ర కార్యాలయంలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఘన నివాళు లర్పించారు. కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి కారుమంచి రామారావు అధ్యక్షత వహించగా పలువురు మాట్లాడుతూ చుండూరులో 1991 ఆగస్టు 6న దళితులపై అతి దారుణంగా, కిరాతకంగా, మానవ మృగాలుగా తయారైన, అగ్రకుల అహంకారులు నరమేధాన్ని సృష్టించారన్నారు. 15 మందిని గొడ్డళ్లు, బరిసెలతో నరికి గోతాలలో చుట్టి తుంగభద్ర కాల్వలో పడేసినా ఆ ఘటనల్లో ముద్దాయిలు ఇప్పటికీ స్వేచ్ఛగా తిరుగుతున్నారని విమర్శించారు. దళితులు నేటికీ దౌర్జన్యాలు, అంటరానితనానికి గువుతూనే ఉన్నారని ఆవేదన వెలిబుచ్చారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కలలుగన్న స్వరాజ్యం, మానవ స్వేచ్ఛ రాజ్యం నేటికీ రాలేదన్నారు. దళితులు తమ ఓటుతో పెత్తందారీ సామాజిక తరగతులకు బుద్ధి చెబితనే వ్యవస్థలో మార్పు సాధ్యమన్నారు. కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆంద్ర మాల్యాద్రి, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి, ఎఎన్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు చార్వాక, డిబిఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎం.భాగ్యరావు, విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్, దళిత ఉద్యమ నాయకులు క్రాంతికుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి అమరావతిలో జంగిల్ క్లియరెన్స్ 2లో

22 గేట్ల ద్వారా కృష్ణమ్మ పరవళ్లు

సాగర్ నుండి 3,08,770 క్యూసెక్కుల విడుదల

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో నాగార్జున సాగర్‌కు వరదనీరు పోటెత్తుతోంది. దీంతో అధికారులు 22 క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 3,08,770 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నుండి 3,55,0710క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతుంది. నాగార్జునసాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు కాగా ప్రస్తుతం 585.20 అడుగులవద్ద నీరు నిల్వ వుంది. డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా ప్రస్తుతానికి 298.0121 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 28,420 క్యూసెక్కులను, కుడి కాల్వ ద్వారా 8067 క్యూసెక్కులను, ఎడమ కాల్వద్వారా 8022 క్యూసెక్కులను, ఎస్.ఎల్.బి.సి ద్వారా 1800 క్యూసెక్కులను, మొత్తంగా 3,55,079 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

పరవళ్లు తొక్కుతున్న జలాశయం అందాలను చూసేందుకు భారీగా పర్యాటకులు తరలి వస్తున్నారు. దీంతో సాగర్ ప్రాజెక్టు పరిసర ప్రాంతాలన్నీ పర్యాటకులతో కిటకిట లాడాయి. కృష్ణమ్మ పరవళ్లు చూసి పర్యాటకులు తమ సెల్ ఫోన్లలో సెల్ఫీ లు దిగుతూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. సాగర్‌లో ఉన్న పర్యాట క ప్రాంతాలైన అనుపు, బుద్ధవనం, కొత్త వంతెన, పాత వంతెన తదితర ప్రాంతాల్లో పర్యాటకుల సందడి నెలకొంది. 2లో

9న క్విట్ కార్పొరేట్స్ నిరసనలు

ప్రజాశక్తి-గుంటూరు, తాడేపల్లి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 9వ తేదీన క్విట్ ఇండియా డే సందర్భంగా క్విట్ కార్పొరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కార్మిక, రైతు సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. క్విట్ కార్పొరేట్స్ కార్యాక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం బ్రాడీపేటలోని జాషువా విజ్ఞాన కేంద్రంలో, తాడేపల్లిలోని మేకా అమరారెడ్డి భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించారు. గుంటూరు సమావేశంలో ఎఐటియుసి రాష్ట్ర గౌరవాధ్యక్షులు వి.రాధాకృష్ణమూర్తి, సిఐటియు జిల్లా అధ్యక్షులు దండాల లక్ష్మీనారాయణ, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, తాడేపల్లి సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ 2లో

తాడేపల్లి సమావేశంలో మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు

గుంటూరు సమావేశంలో మాట్లాడుతున్న రాధాకృష్ణమూర్తి

భారీగా గంజాయి స్వాధీనం

- చేబ్రోలులోని ఒ ఇంట్లో 20.5 కిలోల గుర్తింపు
- ఇద్దరు మైనర్లు సహా నలుగురు అరెస్టు
- పరారీలో మరో నగులురు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తెనాలి డివిజన్‌లో గంజాయి నిల్వలు 20.5 కిలోలు స్వాధీనం చేసుకుని నలుగుర్ని అరెస్టు చేసినట్టు జిల్లా ఎస్‌పి ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. గుంటూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం సాయంత్రం వివరాలు వెల్లడించారు. ఈ కేసులో మొత్తం 8 మంది నిందితులు ఉన్నట్టు గుర్తించగా నలుగురు పరారీలో ఉన్నారన్నారు. నిందితులు గుంటూరు, వట్టిచెరుకూరు, చేబ్రోలుకు చెందిన వారుగా చెప్పారు. వీరిలో చేబ్రోలు మండలం నందమూరికాలనీకి చెందిన కట్టా శ్రీను అలియాస్ డబ్బాల శ్రీను ప్రధాన నిందితుడుగా ఉన్నారు. వట్టిచెరకూరు మండలం కోవెలమూడికి చెందిన తోట రాజేష్ ఉండగా మరో ఇద్దరు మైనర్లున్నారు.

చేబ్రోలు నందమూరి కాలనీ-1 వ లైన్ లో కట్టా 2లో

22 గేట్ల ద్వారా కృష్ణమ్మ పరవళ్లు

(మొదటి పేజీ తరువాయి)

హిల్‌కాలనీ విజయవిహార్ అతిథి గృహం వెనక ఉన్న నూతన లాంచీ స్టేషన్ నుంచి జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండకు నాలుగు లాంచీ ట్రిప్పులను పర్యాటక శాఖ నడుపుతోంది. భారీగా పర్యాటకుల రాకతో ట్రాఫిక్ జాం ఏర్పడింది. పైలాన్ పెట్రోల్ బాంక్ నుండి నూతన వంతెన వరకు రోడ్డుపై ట్రాఫిక్ 2 కిలోమీటర్ల మేర నిలిచింది. పెట్రోల్ బాంక్ నుండి నూతన వంతెన వరకు వాహనాలు భారీగా రావడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. నూతన వంతెన వద్ద కిలో మీటర్ మేర ట్రాఫిక్ మరింతగా పెరిగింది. మెయిన్ రోడ్డు పక్కనే వాహనాలు నిలిపడంతో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం కలుగుతుంది. నాగార్జునసాగర్ పోలీసులు ఎప్పటికప్పుడు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నారు. పర్యాటకులు రద్దీగా ఉన్న ప్రాంతాల్లో మాచర్ల రూరల్ సిఐ కె.సురేష్, విజయపురిసౌత్ ఎస్ఐ పట్టాభి రామయ్య ట్రాఫిక్ క్రమబద్ధీకరిస్తూ భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

9న క్విట్ కార్పొరేట్స్ నిరసనలు

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రంలో తగిన మెజారిటీ లేకపోయినా బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని విమర్శించారు. ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్రబడ్జెట్ కార్పొరేట్లకు మేలు చేసే విధంగా, పేద మధ్యతరగతి ప్రజలపై భారాలు పెంచేదిగా ఉందన్నారు. కార్పొరేట్లకు ఆదాయపు పన్నులు తగ్గించి, సామాన్యులపై పన్నుల భారం మోపిందన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా బిజెపి ప్రభుత్వం మోసం చేసిందని, రైతులను కాన్వాయ్‌తో గుద్దించి ప్రాణాలు తీసిన కేంద్రమంత్రి కుమారుడిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం రైతులపై బిజెపికి ఉన్న కపట ప్రేమకు నిదర్శనం అన్నారు. కార్మిక చట్టాలను రద్దుచేసి కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ అమలుకు పూనుకుందని, న్యాయచట్టాల పేరుతో రవాణారంగ కార్మికులు, ప్రజలపై కఠినమైన శిక్షలు విధించేందుకు పూనుకుందని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలను నిరశిస్తూ కార్మికులు, రైతులు ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమించాలని పిలుపునిచ్చారు. 9వ తేదీన అన్ని మండల కేంద్రాలలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల వద్ద జరిగే నిరసన కార్యక్రమాలలో పాల్గొనాలని రౌండ్ టేబుల్ సమావేశాలు పిలుపునిచ్చాయి. గుంటూరులో సమావేశానికి సిఐటియు గుంటూరు నగర (తూర్పు) కమిటీ ప్రధాన కార్యదర్శి కట్లగుంట శ్రీనివాసరావు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎ.అరుణ్ కుమార్ అధ్యక్షత వహించగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.కృష్ణకాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి యం.కిరణ్, సిఐటియు జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు, జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సిఐటియు) నగర అధ్యక్షులు పి.శ్రీనివాసరావు, ఏఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.హనుమంతరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పచ్చల శివాజీ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జంగాల చైతన్య పాల్గొన్నారు. తాడేపల్లిలో సమావేశానికి సిఐటియు నాయకులు వేముల దుర్గారావు అధ్యక్షత వహించగా వివిధ సంఘాల నాయకులు డి.వెంకటరెడ్డి, బి.వెంకటేశ్వర్లు, ఎం.శ్రీనివాసరెడ్డి, డివి భాస్కరరెడ్డి, కె.కరుణాకరరావు, ఎస్‌కె పీరూసాహెబ్, వీరాస్వామి, టి.బక్కిరెడ్డి, ఆర్‌వి రాఘవయ్య పాల్గొన్నారు.

భారీగా గంజాయి స్వాధీనం

(మొదటి పేజీ తరువాయి)

శ్రీను ఇంట్లో సుమారు 20 కిలోల గంజాను పట్టుకున్నారు. ప్రధాన నిందితుడు అయిన కట్టా శ్రీనుతో పాటు మరికొంత మంది కలసి గత నెల చివరి వారంలో విశాఖపట్నం జిల్లా అరకు ప్రాంతానికి వెళ్లి అక్కడ 25 కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. కట్టాశ్రీను ఇంట్లో దాచారు. ఇక్కడ నుంచి మిగతా ప్రాంతాలకు తీసుకువెళ్లి విక్రయించేలా ప్రణాళిక రూపొందించారు. గంజాయిని ఒక కిలో, రెండు కిలోల చొప్పున పాకెట్లుగా తీసుకెళ్లి వాటిని చిన్న చిన్న గంజాయి పొట్లలుగా చేసి చేబ్రోలు, తెనాలి మండలంలోని కాలేజీల్లో విద్యార్థులకు, స్పిన్నింగ్ మిల్లుల్లో కార్మికులకు, నిరుద్యోగ యువతకు అమ్మి ఎక్కువ మొత్తంలో డబ్బులు సొమ్ము చేసుకోవడం గత కొంత కాలంగా జరుగుతోంది. వీరిపై నిఘా పెట్టిన పోలీసులు మంగళవారం ఉదయం కట్టాశ్రీను ఇంటిపై దాడి చేసి 20.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తెనాలి డిఎస్‌పి జనార్దనరావు పర్యవేక్షణలో పొన్నూరు రూరల్ సిఐ వై.కోటేశ్వరరావు, చేబ్రోలు మహేష్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా పల్నాడును నిలపాలి

అధికారులతో రాష్ట్ర చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ గౌరవ సభ్యులు పద్మావతి సమీక్ష

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా నిలిపేందుకు సంబంధిత శాఖలు సమన్వయ, సహకారంతో నిబద్ధతతో పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ గౌరవ సభ్యులు బి.పద్మావతి అన్నారు. మహిళల అక్రమ రవాణా, డ్రగ్స్ నియంత్రణపై ముందస్తు చర్యలపై జాయింట్ యాక్షన్ ప్లాన్ అమలు - జిల్లా స్థాయి సమీక్ష సమావేశం మంగళవారం పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట కలెక్టరేట్‌లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పద్మావతి మాట్లాడుతూ పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌ల నిర్వహణ, ఫ్రెండ్లీ టీచర్ల గుర్తింపుపై వివరాలు అడిగి నివేదిక అందించాలన్నారు. పిల్లలు డ్రగ్స్‌కు బానిసలు కాకుండా ఏ విధంగా నిరోదించాలి అనే దానిపై యాక్షన్ ప్లాన్ ఏర్పాటు చేయాలన్నారు. బడి మానేసిన పిల్లల వివరాలు సేకరించి దానిక గల కారణాలు తెలుసుకొని అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పోక్సో కేసులు వివరాలనూ నివేదించాలన్నారు. వైద్యారోగ్య శాఖపై సమీక్షలో భాగంగా డీ-అడిక్షన్ సెంటర్లు ఎన్ని ఉన్నాయి? నమోదైన కేసులు, ఆస్పత్రుల్లో మానసిక వైద్యులు ఉన్నారా ? అని అడినారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి.రవి స్పందిస్తూ మానసిక వైద్యులు అందుబాటులో ఉన్నారని, ప్రతి శనివారం డీ-అడిక్షన్ సెంటర్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకు 8 కేసులు నమోదు కాగా వాటిలో గంజాయి-5, నిద్ర

మాత్రలకు అలవాటు పడినవారు -3 గుర్తించామని తెలిపారు. జిల్లా రెవిన్యూ అధికారి కె.వినాయకం, అడిషనల్ ఎస్పీ రాఘవేంద్ర, నరసరావుపేట ఆర్డీఓ పి.సరోజ, ఐసిడిఎస్ పీడీ ఉమారాణి, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం సాంఘిక సంక్షేమ, బి.సి. సంక్షేమ, ట్రైబల్ వెల్ఫేర్, ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్, గురుకులాల వార్డెన్‌లతో సమావేశం నిర్వహించి బాలల హక్కుల పరిరక్షణ చట్టాల అమలుపై పలు సూచనలు చేశారు.

ఆ వరి విత్తనాల కోసం ఆగొద్దు : ఎడిఎ

విత్తన దుకాణం అనుబంద గోదాములో నిల్వలు పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట సబ్ డివిజన్లోని వరి సాగు చేసే రైతులు జె.జి.ఎల్ 384 రకం విత్తనాల కోసం ఎదురు చూడకుండా ప్రస్తుతం సీజన్‌లో సాగుకు అనుకూలంగా వుండే ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధికారులు అనుమతి పొందిన విత్తనాలను సాగు చేయాలని నరసరావుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు పి.మస్తానమ్మ సూచించారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని పలు విత్తన దుకాణాలతో పాటు గోదాములను, ప్రకాష్ నగర్‌లోని ఏపి సీడ్స్ విత్తన విక్రయ కేంద్రాన్ని వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి ఎడిఎ మంగళవారం తనిఖీ చేశారు. నాగార్జున సాగర్ జలాశయంలో నీటి లభ్యత ఆశాజనకంగా ఉండడంతో రైతులు ప్రస్తుతం జెజిఎల్ 384 రకం సాగు చేపట్టేందుకు ఉత్సాహం చూపుతున్నారని, అయితే ప్రస్తుతం ఆ రకం విత్తనాలు ఆశించిన మేర ఉత్పత్తి, సేకరణ లేని కారణంగా రైతులకు అందించడం సాధ్యపడడం లేదని అన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న కె.ఎన్.ఎం 733, 1638, ఎంటియు 1224, 1282, హెచ్.ఎం.టి, సోనా, ఎన్.ఎల్.ఆర్ 34449, బిపిటి , ఏపి 567, జెజిఎల్ 27356 రకాల విత్తన వంగడాలు నరసరావుపేట డివిజన్ పరిధిలో సాగుకు అనుకూలంగా ఉంటాయని చెప్పారు. ఇవి 125 నుంచి 135 రోజుల స్వల్పకాలిక రకాలని, అగ్గి ఇతర తెగుళ్లను తట్టుకుంటుందని తెలిపారు. ఆయా వంగడాల పంటలను మార్కెట్ లో అమ్ముకోవడానికి అనువైన రకాలని తెలిపారు. సెప్టెంబర్ 15లోగా నాట్లు వేయగలిగితే బిపిటి 5204 కూడా అనుకూలంగా ఉంటాయన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో జెజిఎల్ 384 అని రకానికి ఎదురు చూడకుండా పైన తెలిపిన ప్రత్యేకమైన రకాలను కూడా సాగు చేసుకొని అధిక దిగుబడి పొందాలని సూచించారు. జెజిఎల్ 384 రకం నిల్వలు కలిగి ఉన్న దుకాణదారులు అధిక ధరలకు విక్రయిస్తే దుకాణం లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి వి.నరేంద్రబాబు, వ్యవసాయ విస్తరణ అధికారి కె.బ్రహ్మయ్య, ఎం.బోసు, ఎ.శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

15వ తేదీ నుండి రూ.5కే కడుపు నింపుతాం

ప్రజాశక్తి - చిలకలూరిపేట : స్థానిక గడియార స్తంభం సెంటర్, అడ్డరోడ్డు సెంటర్ సమీపంలో పాత అన్న క్యాంటీన్‌లను 15న పున:ప్రారంభానికి సిద్ధం చేస్తున్నట్లు ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు చెప్పారు. పనులను మంగళవారం పరిశీలించిన ఆయన మాట్లాడుతూ పట్టణానికి చుట్టుపక్కల గ్రామాలు ఎక్కువగా ఉండడంతో రైతులు, రోజువారి కూలీలు ఎక్కువగా వస్తుంటారని చెప్పారు. వారు మధ్యాహ్నం భోజనం చేయ చేయాలంటే కనీసం రూ.120-150 అవుతుందని, ఉదయం టిఫిన్ చేయాలన్నా రూ.50 అవుతుందని చెప్పారు. ఈ ఆర్థిక భారం లేకుండా వారికి రూ.15కే టిఫిన్, రెండు పూటల అన్నం అందిస్తామని చెప్పారు.

పులిచింతలకు పెరిగిన వరద

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సాగర్ జలాశయం నుంచి భారీగా వరద నీరు వస్తుండటంతో పులిచింతల జలాశయంకు రాత్రి 10 గంటలకు వరద ప్రవాహం మరింత పెరిగింది. పులిచింతల జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 45.77 టిఎంసీలు కాగా రాత్రి 10 గంటలకు 26.25 టిఎంసీలకు చేరింది. 3.66 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా దిగువకు 1.71 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తికి 10 వేల క్యూసెక్కులు వినియోగిస్తున్నారు. సాగర్ నుంచి భారీగా వరద వస్తుండటం, ఈనీరంతా పులిచింతల ద్వారా దిగువకు వస్తుండటంతో ప్రకాశం బ్యారేజి గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేయనున్నట్టు అధికారులు ప్రకటించారు. అర్ధరాత్రి దాటిన తరువాత ప్రకాశం బ్యారేజి గేట్లు ఎత్తనున్నట్టు తెలిపారు.

9, 10 తేదీల్లో ఆదివాసీ సంఘీభావ సదస్సు

ప్రజాశక్తి - వినుకొండ

హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 9,10 తేదీల్లో జరిగే ఆలిండియా ఆదివాసి సంఘీభావ సదస్సును జయప్రదం చేయాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు కరపత్రాన్ని మంగళవారం ఆవిష్కరించారు. పిడిఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అటవీ ప్రాంతాల్లో ఉన్న ఖనిజ సంపద కొల్లగొట్టడం కోసం కార్పొరేట్ శక్తులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో ఒప్పందాలు చేసుకొని దౌర్జన్యపూరితంగా అడవి ప్రాంతాల నుండి ఆదివాసిలను ఖాళీ చేయిస్తున్నాయని అన్నారు. దీనికి వ్యతిరేకంగా ఆదివాసులు పెద్ద ఎత్తున పోరాడుతున్నారని తెలిపారు. జనవరి నుండి నేటి వరకు 200 మందికి పైగా ఆదివాసులను, విప్లవ కార్లను పోలీసులు కాల్చి చంపారని, వేలాది మంది ఆదివాసులపై ఉపా లాంటి నిర్బంధ చట్టాలు బనాయించి నిర్బంధించారని అన్నారు. వీటికి వ్యతిరేకంగా ఆదివాసులు తెగించి పోరాడుతున్నారని, వారికి సంఘీభావంగా ప్రజా సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు వామపక్ష పార్టీలు, పౌర హక్కుల సంఘాలు ఐక్యమై ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదికగా ఏర్పడి హైదరాబాదులో సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సదస్సులో సిపిఐ జాతీయ కార్యదర్శి డి.రాజా, ప్రొఫెసర్స్ డి.నరసింహారెడ్డి, హరగోపాల్, మాడభూషి శ్రీధర్, రిటైర్డ్ జడ్జి సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొంటారని తెలిపారు. కరపత్ర ఆవిష్కరణలో ఎన్.రామారావు, బి.శ్రీనివాసరావు, షేక్ మస్తాన్‌వలి, జోసెఫ్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి అమరావతిలో జంగిల్ క్లియరెన్స్

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతిలో బుధవారం నుంచి జంగిల్ క్లియరెన్స్ పనులు మొదలు కానున్నాయి. ఉదయం 8 గంటలకు వెలగపూడిలోని సచివాలయం వెనుక వైపు ఎన్-9 రోడ్డు దగ్గర నుంచి జంగిల్ క్లియరెన్స్ పనులను పురపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ ప్రారంభిస్తారని మంత్రి కార్యాలయం నుంచి ప్రకటన వెలువడింది. ఇందుకు అవసరమైన పొక్లెయినర్లు, ఇతర సామగ్రిని సిద్ధం చేశారు. అయితే పనులకు వర్షం అడ్డంకిగా మారింది. వర్షం కారణంగా నేల బురదమయంగా మారడంతో భారీ యంత్రాలు మట్టిలో కూరుకుపోయే ప్రమాదం ఉంది. జంగిల్ క్లియరెన్స్ నెల రోజుల్లో పూర్తి కావాల్సి ఉంది. వర్షాలు ఆగితేనే అనుకున్న సమయానికి పనులు పూర్తవుతాయని భావిస్తున్నారు. జోన్‌ల వారీగా విభజించి (ఒక్కో జోన్ లో 250 ఎకరాలు) జంగిల్ క్లియరెన్స్ పనులు జరగనున్నాయి.

డిప్యూటీ డిఇఒ వేణుగోపాల్‌పై ఫిర్యాదు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట డిప్యూటీ డిఇఓ వేణుగోపాల్‌పై చర్యలు తీసుకోవాలని టిడిపి ఎస్సీ సెల్ పల్నాడు జిల్లా అధ్యక్షులు సాతులూరి కుమార్ మంగళవారం డీఈఓకు వినతి పత్రం అందజేశారు. అనుమతులు కోసం పలు పాఠశాలల యాజమాన్యాల వద్ద అక్రమంగా నగదు వసూలు చేశారని, ఉపాధ్యాయునుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారని ఆరోపించారు. భార్యను హత్య చేసిన ఆయన పాఠశాలను తనిఖీలకు వెళ్లిన సందర్భంలో అతని నేర చరిత్ర తెలిసిన ఉపాధ్యాయినులు భయభ్రాంతులకు గురవుతున్నారని చెప్పారు. డిప్యూటీ డిఇఓ వ్యవహారశైలిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పుట్టినరోజు వేడుకల బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పుట్టినరోజు సందర్భంగా బుధవారం నుండి 13 వరకు నిర్వహించే కార్యక్రమాల వివరాలతో కూడిన బ్రోచర్‌ను గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు మంగళవారం ఆవిష్కరించారు. సత్తెనపల్లి పట్టణం రఘురాం నగర్ ప్రజా వేదికలో టిడిపి నాయకులతో కలిసి చర్చించారు.

తుమ్మపూడి గ్రామాన్ని పరిశీలించిన వైద్య బృందం

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండలంలోని తుమ్మపూడి గ్రామంలో వైరల్ జ్వరాలు ఉన్న నేపథ్యంలో జిల్లా మలేరియా అధికారి ఆధ్వర్యంలో వైద్యాధి కారుల బృందం మంగళవారం పర్యటించినది. వైద్య శిబిరాన్ని గ్రామంలో పారిశుధ్య కార్యక్రమం అమలు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఏ ఎన్ ఎం లు ఆశ వర్కర్లతో కలిసి నీరు నిలువ ఉన్న వాటిని గుర్తించి తగిన సలహాలు సూచనలు చేశారు . దోమలు పెరిగే ఆవాసాలను గుర్తించి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపిడి మాలజిస్ట్ డాక్టర్ వరప్రసాద్ ఏ ఎమ్ ఓ ప్రభాకర్ రెడ్డి ఎస్ యుఓ పున్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్యాక్‌లాగ్ పోస్టులకు రాతపరీక్ష ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీలో భాగంగా 2023లో జారీ అయిన నోటిఫికేషన్ ప్రకారం డ్రైన్‌క్లీనర్, గ్యాంగ్‌మజ్దూర్ పోస్టులకు సంబంధించి ప్రాధమిక అర్హత అయిన తెలుగు లేదా ఇంగ్లీషు భాషలో చదవడం, రాయటంలో అభ్యర్ధుల సామర్ధ్య నిర్ధారణ మంగళవారం స్థానిక జె.సి కాలేజీ ఆఫ్‌లాలో నిర్వహించారు. ప్రతి పరీక్షా హాల్లో వీడియోగ్రఫీ ఏర్పాటు చేసి, పరీక్ష ప్రక్రియను రికార్డ్ చేశారు. పరీక్షా కేంద్రాన్ని జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ. భార్గవ్ తేజ పరిశీలించారు. కాగా మొదటి రోజు ఉదయం, మధ్యాహ్నం జరిగిన డ్రైన్ క్లీనర్ పోస్టునకు 86 మంది అభ్యర్థులకుగాను 43 మంది, గ్యాంగ్ మజ్దూర్ పోస్టుకు 385 మంది అభ్యర్థులకు గాను 228 మంది అభ్యర్థులు హాజరు అయ్యారు. పరీక్షా కేంద్రాన్ని జెసితో పాటు డిఇఒ పి.శైలజ , సాంఘీక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు మధుసూధన రావు సందర్శించారు.

ఉపాధి కార్యాలయంలో రేపు జాబ్‌మేళా

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక గుజ్జనగుండ్ల సెంటర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 8న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.రఘు ఒక ప్రకటనలో తెలిపారు. సువర్ణకుటర్ డెవలపర్స్ ప్రైవేటు లిమిటెడ్, బెక్‌బిఎం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, జయలక్ష్మి ఆటోమొబైల్స్ కంపెనీలు హాజరువుతాయని, కావున నిరుద్యోగ అభ్యర్థులు వినియోగించుకోవాలని కోరారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, బి.టెక్, పి.జి వరకూ చదువుకున్న 18-35 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులని తెలిపారు. జాబ్‌మేళాకు హాజరయ్యే వారు బయోడేటా, విద్యార్హతల సర్టిఫికెట్లు జిరాక్స్, ఆధార్ నకలు, పాస్‌ఫోర్ట్ సైజ్ ఫోటోతో హాజరు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకూ జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. ఇతర వివరాలకు 9866822697, 879079072 నంబర్లలో సంప్రదించాలన్నారు.

జీవిత సత్యాలు పుస్తకం ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రముఖ జర్నలిస్టు గద్దె లక్ష్మీనివాస్ రాసిన జీవిత సత్యాలు- నిత్య సత్యాలు అనే వ్యక్తిత్వ వికాస పుస్తకాన్ని పురపాలక మరియు పట్టణాభివద్ధి మంత్రి పొంగూరు నారాయణ గుళికలను రాష్ట్ర సచివాలయంలో మంగళవారం ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE ADL CIVIL JUDGE (SENIOR DIVISION) NARASARAOPET.
IP 31/2024.

Between:-
Suravarapu Narasimha Reddy .. Petitioner
V/S
R1) Mukku Venkata Narsimha Reddy..
R2) Saginala Eshwari.. .. Respondents

మా క్లయింట్ అయిన సురవరపు నరసింహారెడ్డి గారికి ముక్కు కృష్ణారెడ్డి గారి కుమారుడు ముక్కు వెంకట నరసింహారెడ్డి గారు బాకీ ఉండి సదరు బాకీలు ఎగవేయు దురుద్దేశంతో తమ తాలూకు ఆస్తులను అనగా నరసరావుపేట పట్టణంలోని డి.నెం 21-2-26 మరియు 21-2-27 IN. TS NO: 21 అండ్ ఓల్డ్ అసెస్మెంట్ నెం. 72 గల ఆస్తిని 2వ రెస్పాండెంట్ కు ది. 28-05-2024వ తేదీ కలిగిన ఒక విక్రయ దస్తావేజు వ్రాయించి ఇచ్చినందున సదరు ఒకటవ రెస్పాండెంట్‌ను ఇన్సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని మరియు 2వ రెస్పాండెంట్ పేరున ఉన్న ది.28-05-2024 న 25510/2024 నెం. కలిగిన దస్తావేజు రద్దు చేయమని నరసరావుపేట అడిషనల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) గారి కోర్టులో క్రెడిటర్ ఐపి 31/2024 నెంబరున ఒక ఇన్సాల్వెన్సీ పిటిషన్ దాఖలు చేసి ఉండగా శ్రీ అడిషనల్ సివిల్ జడ్జ్ (సీనియర్ డివిజన్) గారు పై ఐపీ విషయమును ఈ పేపర్ ప్రకటన ద్వారా తెలియజేయవలసిందిగా ఆర్డర్ వేసి ఉన్నందువలన సదరు ఆర్డర్ కు లోబడి ఈ ప్రకటన జారీ చేయడమైనది. కనుక పై విషయములలో ఎవరికైనా ఎటువంటి ఆసక్తి ఉన్నను లేక అభ్యంతరములు ఉన్న ఎడల సదరు వ్యక్తులందరూ ది. 27-08-2024వ తేదీన ఉదయం 10:30 ని.లకు గాని ఆ తేదీకి ముందుగా కాని న్యాయవాది గారి ద్వారా కానీ నేరుగా కానీ నరసరావుపేట అడిషనల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) గారి ఎదుట హాజరై తమకు గల ఆక్షేపణలు తెలియజేసుకోవలెను.

కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం
వాయిదా. 27-08-2024

ఇట్లు.
నల్లపాటి లక్ష్మీనారాయణ,
పిటిషన్ తరపు న్యాయవాది,
నరసరావుపేట.

మహారాజశ్రీ అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S.No.105/2015

కోటగిరి అఖిలాండం మరియు ఇతరులు.... వాదులు
Vs
1.బొనిగల సూర్యప్రకాశరావు & ఇతరుల
... ప్రతివాదులు

ప్రకటన.

టు:
18వ ప్రతివాది.
వంకాయల లక్ష్మీ నాగేంద్రం
R/o D.No.8-6-30, 2 2, 5th Line
గుంటూరు సిటీ, మరియు జిల్లా.

పై నంబరు దావా లో మీకు ఎన్ని సార్లు దావా సమనులు నోటీసులు పంపినప్పటికి మీరు దురుద్దేశ్యపూర్వకముగా తీసుకొనక తిరిగి పంపుచున్నందువలన మీకు పై దావా లో నోటీసును ఈ ప్రకటన ద్వారా కోర్టువారు జారీ చేసి మీ హాజరు నిమిత్తం ఈ దావాను తేది. 09-09-2024 నకు వాయిదా వేశారు. కావున మీరు ఆ తేదిన ఉదయం గం.10-30ని.లకు పై కోర్టువారి ఏదుట స్వయముగా గాని వకీలు ద్వారాగాని హాజరయి పై పిటిషన్ లో మీ ఆక్షేపణలను తెలియజేయవలెను. లేని ఏడల పై దావా ను మీ పరోక్షమందు తీర్మానించదరని తెలియ జేయడమయినది.

// శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో //
వజ్రాల అంజిరెడ్డి,
బి.యస్.సి., బి.యల్
వాది తరుపు న్యాయవాది
Cell No : 9848180604

GENERAL NOTICE
In the court of the Honourable Addl. Civil Judge (Senior Division) :: Tenali
I.P. No. 19/2024

Between :
Kollipara Manikanta, S/o Gouri Sankar, Tenali ..... Petitioner
And
1) Tunuguntla Mahendra Manoj, S/o Dhanush, Tenali
2) Kollipara Harinath Babu S/o Appa Rao, Tenali
3) Nadimpalli Srinivasa Rao, S/o Sankaraiah, Inimatla village
4) Kalisetty Samba Siva Rao, S/o Sai Babu, Kolakaluru
5) Burlagadda Ramakrishna S/o Satya Narayana, Tenali.
6) Satti Ramesh S/o Venkata Reddy, Settybalijapet,
7) Boppana Vijay Kumar S/o Sambasiva Rao, Tenali.
8) Gadamsetty Srinivasulu, S/o Venkateswarlu, Tenali
9) Agarwal Venkata Naga Mani Bai W/o Vasantha Lal, Tenali.
10) Madupalli Madhava Rao, S/o Basaveswara Rao, Tenali.
11) Jasti Amareswara Rao, S/o Koteswara Rao, Tenali
12) Annabathuni Sudhakar, S/o Srinivasa Rao, Tenali.
13) Cheedella Dhakshina Murthy, S/o Subba Rao, Tenali.
14) Karumuri Jagadeesh Kumar S/o Satyanarayana, Tenali.
15) Yelchuri Chakravarthy, S/o Jaya Murthy, Tenali.
16) Vutukuri Prasada Rao, S/o Bapiseety, Tenali.
17) Chandolu Pulla Rao, S/o Lakshmi Narayana, Tenali.
18) Nidamanuru Srinivas Rao, S/o Anjaneyulu, Isukapalli
19) Bhaskaruni Lakshmi Narayana, S/o Siva Venkata Subrahmanyam, Tenali.
20) Kommuri BN Vijay kumar S/o Sai babu, Vemuru.
21) Polisetty Srilinga Seshu S/o Bhujanga Rao, Tenali.
22) Desu Naga Venkata Ravi Kumar S/o Gurunadham, Vijayawada.
23) Yanmana Adi Narayana Reddy S/o Subba Reddy, Guntur.
24) Koppu Ravi Kiran, S/o K.V.S. Brahmam, Guntur.
25) Official Receiver, Guntur
... Respondents

పై నెంబరు ఐ.పి.లో పిటీషనరు తనను ఇన్‌సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని కోరుచూ పిటీషన్ దాఖలు చేయగా, సదరు పిటీషన్‌పై ఎవరికైనా అభ్యంతరాలు వుంటే తెలుపుకోమని శ్రీ కోర్టువారు జనరల్ నోటీసుకు ఆర్డరు వేస్తూ మీ హాజరు నిమిత్తం ది. 30-8-2024వ తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, మీ తరపు న్యాయవాది ద్వారా గానీ శ్రీ కోర్టువారి యెదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేనియెడల సదరు పిటీషన్‌ను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని యావన్మందికి తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)
వాయిదాతేది: 30-8-2024

నరిశేటి వేణుగోపాలరావు,
పిటీషనర్ తరపు అడ్వకేట్,
తెనాలి/ సత్తెనపల్లి.
సెల్ : 91338 13357.

మహారాజశ్రీ తెనాలి అడిషనల్ సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
Creditor I.P. 69/2022

బిట్వీన్ :
Dega Srikanth .... పిటీషనర్
ఎదిరి
Potharlanka Eswara Rao and others
.... రెస్పాండెంట్స్

To,
R1 : Potharlanka Eswara Rao, S/o Sambaiah, D.No. 13-8-42/1, Pinapadu, Tenali, Guntur dist.
R2 : Vemulapalli Sambasiva Rao, S/o Venkatramaiah, D.No. 2-22-3, Nandula pet, Tenali.
R3 : Andugula Rosamma, W/o Daniel, D.No. 6-188, Vetapalem Village, Tsunduru Mandal.

పై నెంబరులో పిటీషనర్ మీపై సదరు కోర్టులో క్రెడిటార్ ఇన్‌సాల్వెంట్ పిటీషన్ దాఖలు చేసియున్నందున మీ హాజరు నిమిత్తం ది. 19-8-2024వ తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, మీ తరపు న్యాయవాది ద్వారా గానీ శ్రీ కోర్టువారి యెదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేనియెడల సదరు పిటీషన్‌ను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)
వాయిదా : 19-8-2024

Bethala Prabhakara Rao
పిటీషనర్ తరపు అడ్వకేట్, తెనాలి.
సెల్ నెం : 9642337777

వేలం ప్రకటన
మహారాజశ్రీ తెనాలి అడిషనల్ సివిల్‌జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
ఇ.పి. 16/2023 ఇన్ ఓ.యస్. 192/2016

బిట్వీన్ :
కుందేటి శివరామకృష్ణమూర్తి .... డి.హెచ్.ఆర్.
వర్సెస్
అంచే వెంకట శివరామ ప్రసాదరావు (డైడ్) అండ్ వగైరాలు .... జె.డి.ఆర్స్

ఈ దిగువ తెలియపరచిన జెడిఆర్స్ తాలూకు షెడ్యూల్ దాఖలా ఆస్థిని పై కోర్టువారు 9-9-2024 న ఉదయం 10-30 గం.లకు పై కోర్టులో బహిరంగ వేలం వేయుదురు, వలయువారు పాట పాడుకొన వచ్చును.

షెడ్యూలు : గుంటూరు డి॥ దుగ్గిరాల సబ్ డి॥ ఈమని గ్రామపంచాయతీ - ఈమని గ్రామం - 6వ వార్డు, డి.నెం. 875/11 - 149 చ॥ గజాల స్థలం అందులోని 628 చ॥ అడుగులలోని పెంకుటిల్లు మరియు 288 చ॥ అడుగులలోని ఎంటిసి డాబా ఇల్లు, ఎసిసి టాయిలెట్స్‌తో సహా డోర్ నెం.6/18కి హద్దులు : తూర్పు : అంచె పూర్ణచంద్రరావు గారి ప్రహరీగోడ - 24 అడుగులు దక్షిణం : సర్కారు రోడ్డు - 52 అడుగులు పడమర : అంచె సాంబశివరావు గారి ఆస్థి - 28 అడుగులు ఉత్తరం : కన్నెగంటి కన్యాకుమారి గారి ఆస్థి - 52 అడుగులు.

ఇ.సి. దాఖలా ఎట్టి అన్యాక్రాంతములు లేవు. ఇ.పి. షెడ్యూలు ఆస్థి ఈ నెంబరు జెడిఆర్స్ యొక్క సర్వ సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములు గల ఆస్థి అయివున్నది.

డి.హెచ్.ఆర్. విలువ : రూ.7,50,000/-
అమీనా విలువ : రూ.10,00,000/-
వేలం వాయిదాతేది : 9-9-2024
ఫరదర్ హియరింగ్ తేది : 17-9-2024

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)
ఎ.కాశీవిశ్వనాధరాజు,
పి.తరుణ్‌కుమార్,
డి.హెచ్.ఆర్. తరపు న్యాయవాదులు, తెనాలి.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

ప్రజాశక్తి-గుంటూరు

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ సూచించారు. మంగళవారం ఎమ్మెల్యే సంజీవయ్యనగర్ పినపాక ప్రభుదాస్ మున్సిపల్ హైస్కూల్‌ను సందర్శించారు. పేద విద్యార్థులకు చదువు భారం కాకూడదని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పేరుతో రూ.15వేలు అందించబోతున్నట్లు చెప్పారు. ఈనెల 8వ తేదీన జరిగిన పేరెంట్స్ కమిటీ ఎన్నికల గురించి ప్రతి తల్లిదండ్రులకు సమాచారం తెలియజేయాలన్నారు. ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాలకు మంజూరైన ఆర్ఒ వాటర్ ప్లాంట్‌ను అమర్చకపోవటంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ముప్పవరం భారతి, మాజీ కార్పొరేటర్ జి.ప్రభాకర్, వార్డు అధ్యక్షులు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పేద క్రీడాకారుడికి రోటరీ ఆర్థిక సాయం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ఏటి అగ్రహారంలోని శ్రీజేత స్కూల్లో 5వ తరగతి చదువుతూ, స్కేటింగ్‌లో రాణిస్తున్న షేక్.పీర్ భాషాకు రోటరీ క్లబ్ గుంటూరు సెంటినియల్ వారు రూ.35వేలు సహకారం అందించారు. పీర్‌బాషా స్కేటింగ్ ఆటలో రాణిస్తూ రాష్ట్ర స్థాయి పోటీల్లో అనేక బహుమతులు గెలుపొందాడు. అలాగే ఆగస్టు 8 నుండి 17వ తేదీ వరకూ ఢిల్లీలో జరిగే ఐస్ స్కేటింగ్ 19వ జాతీయ చాంపియన్‌షిప్‌కు ఎంపిక అయ్యాడు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నట్లు తెలుసుకున్న రోటరీ క్లబ్ వారు ఆర్థిక సాయాన్ని సంస్థ అధ్యక్షులు పొనగల్లు బాలసుబ్రహ్మణ్యం, సెక్రెటరీ తొట్టెంపూడి నవీన్ చక్రవర్తి, అసిస్టెంట్ గవర్నర్ మలినేని పెరుమాళ్లు క్లబ్ సభ్యుల తరుపున అందచేశారు. కార్యక్రమంలో మాజీ ప్రెసిడెంట్ మద్దినేని సుధాకర్, పెరవలి నాగవంశీ, మైనేని వీరయ్య, సుష్మ, మన్నవ రాజగోపాల్ తదతరులు పాల్గొన్నారు.

బాషాకు నగదు సాయం అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

పురపాలక సంఘ కార్యాలయము, సత్తెనపల్లి

ఆర్.ఓ.సి.నెం.113/2021/ఎ1 **తేది. 05-08-2024**

టెండర్ కమ్ బహిరంగ వేలము నోటీసు

సత్తెనపల్లి పురపాలక సంఘ పరిధిలో గల. మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నందలి ఈ దిగువ తెలిపిన షాపు రూములు నిర్ణయించిన నెలసరి అద్దె పై బహిరంగ వేలమును ది.19-08-2024న సోమవారం ఉదయం 11.00 గంటలకు మునిసిపల్ కార్యాలయము నందు మునిసిపల్ కమీషనరు గారిచే గాని లేదా వారి అనుమతి పొందిన అధికారి వారిచే గాని బహిరంగ వేలము నిర్వహించబడును. 1.NTR మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నందలి షాపు నంబర్లు 6,7,8,9,23, 24,26,30,32 మరియు 35 లు 6వ నం. వికలాంగులు (PHC) లకు మరియు 2వ నెం. SC లకు మరియు 8వ నం. STలకు కేటాయింపు చేయబడినవి. 2. యర్రం వెంకటేశ్వర రెడ్డి మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్: షాపు నంబర్లు 14,15,17,18 మరియు B Block (14వ నం.BC(సొసైటీ) వారికి కేటాయింపు చేయబడినవి) 3. వావిలాల గోపాలకృష్ణయ్య మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ : షాపు నంబర్లు 1,2,3,4 మరియు 5 (4వనం. BC (సొసైటీ) మరియు 2వనం. SC లకు కేటాయింపు చేయబడినవి) 4. శ్రీమతి గంటా సరస్వతి మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్: షాపు నంబర్-2. 5. రాజీవ్ గాంధీ కూరగాయల మార్కెట్ నందలి షాపు నంబర్లు 3,5,14,15,17,19,28, 30,38,39,41,43 మరియు 44 జనరల్ కేటగిరీ 18 మరియు 29 షాపులు ST కేటగిరీ, 4,27 మరియు 40 షాపులు SC కేటగిరీ మరియు 42వ నెంబరు వికలాంగులు (PHC) లకు కేటాయించబడినది. సదరు బహిరంగ వేలమునకు సంబంధించిన పూర్తి వివరములు కార్యాలయము పనిచేయు వేళలలో రెవిన్యూ విభాగము నందు అడిగి తెలుసుకొనవచ్చును

సం/- కొలిమి షమ్మి, కమీషనరు
సత్తెనపల్లి పురపాలక సంఘం

పంట రుణం కోసం ధర్నా

- భూ యజమాని రుణం తీసుకున్నారంటూ కౌల్దార్లకు నిరాకరించిన యూనియన్ బ్యాంక్ మేనేజర్
- కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో బ్యాంకు ఎదుట నిరసన

ప్రజాశక్తి - రాజుపాలెం

భూ యజమాని రుణం తీసుకున్నారనే సాకుతో కౌలురైతులకు పంట రుణం ఇవ్వడానికి బ్యాంకు నిరాకరించడానికి నిరసనగా కౌలురైతులు ఆందోళన చేపట్టారు. మండల కేంద్రమైన రాజుపాలెంలోని యూనియన్ బ్రాంచ్ ఎదుట కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి వై.రాధాకృష్ణ మాట్లాడుతూ కౌలురైతులు ఏడేళ్లగా జాయింట్ లైబులిటి గ్రూపులుగా ఏర్పడి రుణాలు పొందుతున్నారని, అయితే డబుల్ ఫైనాన్స్ అంటూ మేనేజర్ రుణం నిరాకరించారని అన్నారు. సిసిఆర్‌సి కార్డులున్న కౌల్దార్లందరికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రూ.1.6 లక్షల పంట రుణాన్ని హామీలేకుండా ఇవ్వాల్సి ఉందని చెప్పారు. అయితే భూ యజమానులు రుణాలు తీసుకున్నారంటూ కౌల్దార్లకు రుణాలన్ని ఎలా తిరస్కరిస్తారని ప్రశ్నించారు. ఒక గ్రూపునకు చెందిన ఐదుగురు కౌల్దార్లు 34 ఎకరాలు సాగు చేస్తున్నారని, వారురు కగతంలో ఐదు లక్షలు రుణం పొందారని గుర్తు చేశ్యారు. ఇప్పుడు అదే గ్రూపునకు రూ.8 లక్షల రుణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడి వినతిపత్రం ఇచ్చారు. ధర్నాలో కౌలురైతు మండల కార్యదర్శి ఎం.పిచ్చిరెడ్డి, వై.రామారావు, ఎం.చిన వీరయ్య, ఎం.బాల, డి.నాగార్జున, పున్నయ్య, అమరేశ్వరరావు, రమేష్, గోపయ్య పాల్గొన్నారు.

మహావిషాదం.. హిరోషిమా నాగసాకీపై అణుబాంబుతో దాడి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఆరెంజ్ సెంటర్లోని మోడ్రన్ డిగ్రీ కళాశాలలో మంగళవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో హిరోషిమా దినోత్సవాన్ని నిర్వహించారు. సిఆర్ ఇంజినీరింగ్ కళాశాల విశ్రాంత గ్రంథపాలకులు టి.ప్రతాపరెడ్డి మాట్లాడుతూ అగ్రరాజ్యాల సామ్రాజ్య విస్తరణ కాంక్ష అణుబాంబు రూపంలో జపాన్‌లోని హిరోషిమాను బలిగొన్నదన్నారు. మానవాళి తీసుకున్న నిర్ణయం వల్ల ప్రపంచంలోనే తొలిసారిగా మహావిషాదం నెలకొన్నదన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావతం కాకుండా ప్రపంచ శాంతి కోసం అందరూ మనం ప్రతిజ్ఞ చేయాలన్నారు. డాక్టర్ పివి సుబ్బారావు మాట్లాడుతూ హిరోషిమా, నాగసాకీలపై అమెరికా అణుబాంబులు వేయడం ప్రపంచాన్ని కలచివేసిందన్నారు. అనిశెట్టి సుబ్బారావు వంటి కవులు తమ కాలాలు ఝుళిపించి అమెరికా చర్యను తీవ్రంగా నిరసించారని చెప్పారు. కార్యక్రమంలో జెవివి పల్నాడు జిల్లా అధ్యక్షులు డి.బుజ్జిబాబు, గౌరవాధక్షులు డాక్టర్ చుక్కా విన్సెంట్ పాల్, షేక్ చినమస్తాన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పల్నాడు బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో దేశభక్తి గీతాల పోటీలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో రానున్న 78వ స్వాతంత్ర్య దినోత్సవాల్లో భాగంగా పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణ సమీపంలోని లింగంగుంట్ల శంకరభారతిపురం జెడ్‌పి పాఠశాలలో ఈ నెల 10వ తేదీన ఉదయం 9 గంటల నుండి దేశభక్తి గీతాల పోటీలు నిర్వహిస్తామని బాలోత్సవం కమిటీ కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు మంగళవారం తెలిపారు. భావి భారత పౌరుల్లో ఐక్యత, దేశభక్తి భావాలను పెంపొందించడం దేశ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడడంతో పాటు సృజనాత్మకతను నింపడం కోసం విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. నరసరావుపేట పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు జూనియర్స్ (6, 7, 8 తరగతులు), సీనియర్స్ (9, 10 తరగతులు) విభాగాలలో ఈ పోటీలు ఉంటాయన్నారు. దేశభక్తి గీతాలు పోటీల్లో గ్రూప్, సోలోగా పోటీలు ఉంటాయని, గ్రూపులో కనీసం 4 విద్యార్థులు ఉండాలని, పాట 4 నిమిషాలు మించకూడదని వివరించారు. అన్ని పాఠశాలల విద్యార్థులకు అవకాశం ఇవ్వడం ఇచ్చే ఉద్దేశంతో ఒక పాఠశాల నుండి ఒక గ్రూపు మాత్రమే పాల్గొనాలని, వ్యక్తిగత విభాగంలో ప్రతి స్కూల్ నుండి ఇద్దరు మాత్రమే పాల్గొనడానికి వీలుంటుందని చెప్పారు. ప్రతి విభాగంలో మొదటి 5 స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు జ్ఞాపికలు అందిస్తామని, పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికీ పల్నాడు బారోత్సవాల ప్రశంసా పత్రాన్ని అందజేస్తామని తెలిపారు. పోటీలో పాల్గొనే విద్యార్థుల వివరాలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ డైరెక్టర్స్ గురువారం లోగా విద్యార్థుల పేర్లను నమోదు చేయించుకోవాలని, మరిన్ని వివరాలకు 9703050369 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

స్టేడియంలో నీరు నిలవడంపై ఎమ్మెల్యే అసహనం

స్టేడియంను పరిసరాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణంలోని కోడెల శివప్రసాదరావు స్టేడియంలో వర్షం నీరు నిలవడంపై నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అసహనం వ్యక్తంచేశారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని స్టేడియాన్ని మంగళవారం పరిశీలించిన ఆయన స్థానిక పరిస్థితిపై అధికారులతో మాట్లాడారు. తక్షణమే వర్షం నీటిని బయటకు పంపించేలా ఏర్పాట్లు చేయాలని, నీరు నిలిచే ప్రాంతాలను చదును చేయాలని ఆదేశించారు. క్రీడాకారులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలన్నారు.

వర్ష బాధితులను ఆదుకుంటాం

ఇటీవల కురిసిన వర్షాలకు ఇల్లు కూలిపోయిన సాయినగర్‌కు చెందిన సీతా మహాలక్ష్మిని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మంగళవారం పరార్శించారు. బాధిత కుటుంబానికి పరిహారం అందించాలని అధికారులను ఆదేశించారు. త్వరలోనే పక్కా ఇల్లు మంజూరు చేయించి ఆదుకుంటామని చెప్పారు.

పరిశుభ్రతతోనే ప్రశాంత జీవనం

ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పాటు చేసుకోవడం ద్వారానే ప్రశాంతమైన జీవనం సాకారమవుతుందని ఎమ్మెల్యే అరవిందబాబు అన్నారు. నరసరావుపేట పట్టణంలోని 12,15,17,22,31 వార్డుల్లో మున్సిపల్ కార్మికులతో కలిసి స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. వీధుల్లో తిరిగి కాల్వలు శుభ్రం చేశారు. డయేరియా, డెంగీ, మలేరియా లాంటి వ్యాధుల్ని నిర్లక్ష్యం చేయడానికి వీల్లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో పంచాయతీల్లో కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లేందుకు కూడా నిధులు లేకుండా దోచుకున్నారని విమర్శించారు.

ఎమ్మెల్యేను కలిసిన నూతన తహశీల్దార్

నరసరావుపేట నూతన తహశీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కొనికినేని వేణుగోపాల్ మంగళశారం ఎమ్మెల్యే అరవిందబాబును గుంటూరు రోడ్డులోని టిడిపి కార్యాలయంలో కలిశారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు పని చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే సూచించారు.

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు పథకాలను అమలు చేయాలి

ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుకు కార్మికుల వినతి

ప్రజాశక్తి - వినుకొండ

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలను అమలు చేసే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని భవన నిర్మాణ కార్మికులు ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులను కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యేను భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో మంగళవారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు అవ్వారు ప్రసాదరావు మాట్లాడుతూ కార్మిక బోర్డు పథకాల అమలుకు అడ్డుగా ఉన్న మెమో 1241ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని కోరారు. ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.3 కోట్లకు పైగా క్లెయిములను పరిష్కరించాలని విన్నవించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యలను కార్మిక శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని చెప్పారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు ఆంజనేయులు, ఎ.ఆంజనేయులు, వెంకటప్పయ్య ఉన్నారు.

క్వార్జ్ క్రిస్టల్ కోసం తవ్వితే చర్యలు : సిఐ

ప్రజాశక్తి నకరికల్లు

మండలంలోని నరసింగ పాడు పూరిబోడు కొండ ప్రాంతాన్ని సత్తెనపల్లి రూరల్ సిఐ రాంబాబు సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కొంతమంది గ్రామస్తులు ముఠాగా ఏర్పడి రాత్రి సమయాల్లో కొండ ప్రాంతంలో క్వార్జ్ క్రిస్టల్ కోసం తవ్వకాలు చేపడుతున్నారని సమాచారంతో పరిశీలించినట్లు చెప్పారు. తవ్వకాలు జరిపితే పోలీసుల దృష్టికి తేవాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా తవ్వకాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కేరళ సిఎం సహాయ నిధికి భగత్‌సింగ్ భవన్ నిర్వహణ కేంద్రం విరాళం జమ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌లో వర్షాల కారణంగా కొండ చరియలు విరిగిపడి వందల మంది మరణించడంతోపాటు వేలాది మంది నిరాశ్రయులైన నేపథ్యంలో కేంద్రం వెంటనే జాతీయ విపత్తుగా ప్రకటించి ఆదుకోవాలని మండల కేంద్రమైన రొంపిచర్లలోని భగత్‌సింగ్ భవన్ నిర్వహణ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు దాతల నుండి సేకరించిన విరాళాన్ని కేరళ ముఖ్యమంత్రి సహాయ నిధికి బ్యాంకు ద్వారా మంగళవారం జమ చేశారు. భగత్ సింగ్ భవన్ నిర్వహణ కమిటీ ముఖ్య కార్యదర్శి ఎస్.రామకృష్ణంరాజు మాట్లాడుతూ వరద బీభత్సంతో వయనాడ్ అతలాకుతలమైందని, పర్యాటక ప్రాంతంగా ప్రఖ్యాతిగాంచిన వయనాడ్ ప్రస్తుతం ఇలాంటి స్థితిలో ఉండటం బాధాకరమని ఆవేదన వెలిబుచ్చారు. ఆపత్కాల సమయంలో కేరళకు అండగా నిలవాల్సిన కేంద్ర ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. భగత్ సింగ్ భవన్ నిర్వహణ కమిటీ పిలుపు మేరకు స్పందించి విరాళాలు అందజేసిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.



రాజారమేష్‌కు వినతిపత్రం ఇస్తున్న బాధిత రైతులు

డిప్యూటీ సిఎం దృష్టికి యడవల్లి ఎస్సీ, ఎస్టీ రైతుల సమస్యలను తీసుకెళ్తాం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

వైసిపి పాలనలో నియోజకవర్గాన్ని మాజీ మంత్రి విడదల రజిని అన్ని విధాలా దోచుకున్నారని జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజరమేష్ విమర్శించారు. ఆయన్ను కలవడానికి యడవల్లి ఎస్సీ, ఎస్టీ రైతులలు మంగళవారం వచ్చారు. యడవల్లి దళిత రైతులు 46 ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న పొలాలను గత వైసిపి ప్రభుత్వం అక్రమంగా లాక్కున్నారని బాధిత రైతులు వివరించారు. రాజారమేష్ మాట్లాడుతూ భూముల విషయాన్ని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తానన్నామన్నారు.

నదీపరివాహక రామాపురంలో ఎంపిడిఓ పరిశీలన

ప్రజాశక్తి - దాచేపల్లి

కృష్ణానది పరివాహక ప్రాంతమైన మండలంలోని రామాపురం సచివాలయాన్ని ఎంపిడిఓ ఎస్.వెంకటేశ్వరరావు మంగళవారం సందర్శించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రజలతోపాటు అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎగువ నుండి కృష్ణానదికి అధికంగా నీరు వస్తున్న నేపథ్యంలో వరదలు సంభవిస్తే తక్షణ రక్షణ చర్యలకు అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

పత్తిలో పచ్చదోమ, రసంపీల్చే పురుగు

ప్రజాశక్తి - చిలకలూరిపేట : పత్తిపైరులో ఎక్కడ చూసినా పచ్చదోమ, రసం పీల్చే పురుగులు కన్పిస్తున్నాయని, వాటి నిర్మూలనకు రైతులు సత్వరం చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి టి.శ్రీలత అన్నారు. సమాచార హక్కు చట్టంపై అవగాహనలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులకు మంగళవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం–2005ను ఎలా సద్వినియోగం చేసుకోవాలో రైతులకు వివరించారు. అధికారుల విధులను భాద్యతలను చెప్పారు. అనంతరం పత్తిలో సస్యరక్షణ చర్యలను వివరించారు. ఎఇఓ జీపీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి 5
గుంటూరు జిల్లా
బుధవారం 7 ఆగస్టు 2024

ఎసిసి సిమెంటు ఫ్యాక్టరీ భూముల్లోకి పొక్లెయినర్లు

అడ్డుకున్న కార్మికులు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి బ్రహ్మానందపురంలో ఉన్న ఎసిసి సిమెంటు ఫ్యాక్టరీ భూముల్లోకి ఎన్‌ఆర్‌ఐలు అక్రమంగా మంగళవారం నాలుగు ప్రొక్లెయినర్లను దించి చదును చేసే పనులు చేపట్టారు. విషయం కార్మిక కుటుంబాలకు తెలియడంతో పెద్దఎత్తున అక్కడకు చేరుకుని పొక్లెయినర్ పనులను అడ్డుకున్నారు. ఎసిసి సిమెంటు ఫ్యాక్టరీ భూములపై కార్మికులకు అనుకూలంగా గతంలో కోర్టు తీర్పునిచ్చింది. కార్మికుల బకాయిలు పూర్తిగా చెల్లించిన తరువాతే భూములు అమ్ముకోవాలని ఆదేశించింది. కానీ కారుచౌకగా భూములు కొట్టేసిన ఎన్‌ఆర్‌ఐలు కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిలు ఇవ్వకుండానే భూముల్లోకి దిగి ఉద్రిక్తత సృష్టిస్తున్నారు. విషయం తెలిసిన వెంటనే సిఐటియు నాయకులు వేముల దుర్గారావు, బూరుగ వెంకటేశ్వర్లు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ అక్కడకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోర్టు తీర్పును సైతం ఎన్‌ఆర్‌ఐలు ధిక్కరించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కార్మికుల కుటుంబాల జీవితాలతో ఆటలాడుకుంటున్నారని దుయ్యబట్టారు. తమకు రావాల్సిన బకాయిలు పూర్తిగా వచ్చేంత వరకు ఇక్కడ ఎటువంటి పనులూ జరగనివ్వమని హెచ్చరించారు. ఎన్‌ఆర్‌ఐ ప్రతినిధి బాబు అక్కడకు చేరుకుని కార్మికులు చెబుతున్న న్యాయమైన వాదనను విని ప్రొక్లెయినర్లను వెనక్కి తీసుకెళ్లారు. చదును చేసే పనులు నిలిపివేశారు. మంత్రి నారా లోకేష్‌కు కూడా ఇటీవల సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులు తమ సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించినట్లు కార్మికులు తెలిపారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కార్మికులు కోరుతున్నారు. బకాయిలు చెల్లించే వరకు కార్మికుల తరపున తమ పోరాటం కొనసాగుతుందని సిఐటియు నాయకులు వేముల దుర్గారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వై.యొహోషువా, వై.సుబ్బారావు, నవనీతం, గౌరమ్మ, ఇమామ్‌బి, శారద, వై.రమాదేవి, బి.అంకయ్య, సూర్యప్రకాష్, డి.నాగేశ్వరరావు, గురవయ్య, బి.దానయ్య తదితరులు పాల్గొన్నారు

చుండూరు మృతవీరులకు నివాళి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

బహుజన మహాసభ ఆధ్వర్యంలో కాకుమాను వారి తోట యానాది కాలనీలో చుండూరు మృతవీరుల సంస్మరణ సభ మంగళవారం జరిగింది. ఈ సభకు సోషల్ వర్కర్ శిఖా రమేష్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన బహుజన మహాసభ కేంద్ర కమిటీ కార్యదర్శి జి ఆర్ భగత్ సింగ్ మాట్లాడుతూ 33 సంవత్సరాల క్రితం జరిగిన మారణకాండలో నిందితులకు శిక్ష పడలేదన్నారు. దళితులకు ఈ దేశంలో జరుగుతున్న న్యాయం ఈ కేసు రుజువు చేసిందన్నారు. ఇప్పటికీ ఈ కేసు సుప్రీంకోర్టులో విచారణలో ఉందన్నారు. అలాగే కారంచేడు కేసు కూడా సుప్రీంకోర్టులో వ్యాజ్యం జరుగుతుందన్నారు. దళితులపై వివక్ష కొనసాగుతున్నా పాలనా యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ సభలో ఇండియన్ బ్యాంక్ రిటైర్డు మేనేజర్ వేటగిరి శ్రీనివాసరావు, బహుజన నాయకులు న్యాయవాది పలుకూరి ప్రసాదరావు , రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు, ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు న్యాయవాది రాయపూడి మాణిక్యరావు (మణి), కొల్లా వెంకటేశ్వరరావు న్యాయవాది గుంటూరు విజయ కుమారి , ప్రజా ఉద్యమ నాయకురాలు సావిత్రి, యానాది మహిళా సంఘం నాయకురాలు ఇండ్ల నాగేంద్రం తదితరులు పాల్గొని ప్రసంగించారు.

మూడు దశాబ్ధాలు దాటినా దోషులకు శిక్షలేవి?

ప్రజాశక్తి-తెనాలిరూరల్

చుండూరు మారణకాండలో మాల, మాదిగలు అమరులై నేటికి 33 ఏళ్ళు గడచినా దోషులకు శిక్షలు పడకపోవడం శోచనీయమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఉన్నం ధర్మారావు మాదిగ అన్నారు. చుండూరు మృతవీరుల దినోత్సవం సందర్భంగా తెనాలి మండలం కొలకలూరులో మంగళవారం అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చుండూరు మారణకాండ ఘటనపై స్పందించిన కత్తి పద్మారావు, న్యాయవాది చంద్రశేఖర్, ఎమ్మార్పీఎస్ నాయకులు మంద కృష్ణ మాదిగ చుండూరులో ప్రజా కోర్టు ఏర్పాటుకు కృషి చేశారన్నారు. ఆ కోర్టులో దోషులకు శిక్షలు ఖరారైతే ఉన్నత న్యాయస్థానం ఆ తీర్పును కొట్టివేయడం దుర్మార్గమన్నారు. దళితులను అన్యాయంగా పొట్టన పెట్టుకున్నవారిని శిక్షించాల్సిన బాధ్యత చట్టంపై లేదా అని ప్రశ్నించారు. సుప్రీం కోర్టులో ఈ కేసును తాత్సారం చేయడం వెనుక అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే దోషులకు శిక్షలు ఖరారు చేయాలని డిమాండ్ చేశారు.

సెయింట్ ఆన్స్‌లో కెరీర్ గైడెన్స్ సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న అయ్యప్ప

స్థానిక గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై యువజన సర్వీసుల శాఖ, స్టెప్, కళాశాల యాజమాన్యం, ఐక్యూఎసి సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆటమ్స్ గ్రూప్ అధినేత ఎస్. అయ్యప్ప, స్టెప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.వెంకటేశ్వర్లు పాల్గొని విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, ఉన్నత విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. ఒక వ్యక్తి లక్ష్యం చేరుకునే క్రమంలో వ్యక్తిగత సాంఘికంగా, ఆర్థికంగా ఎన్ని అవరోధాలు వచ్చినా లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. సానుకూల ధృక్పదాన్ని కలిగి సమాజంలో ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకంగా ఉండాలన్నారు. సదస్సుకు ప్రిన్సిపాల్ రెవ.సిస్టర్ సంధ్య అధ్యక్షత వహించగా, అధ్యాపకులు సిహెచ్.స్వర్ణ చరణిరామ్, బి.జాయిస్, ఆర్.షారూన్‌రోజ్ పాల్గొన్నారు.

సహజకాన్పులను పెంచండి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సహజ కాన్పుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. మంగళవారం జిజిహెచ్ ప్రసూతి వార్డులోని సమావేశ మందిరంలో సహజ కాన్పుల్లో శిక్షణ పొందిన మిడ్ వైఫరీ ఎడ్యుకేటర్స్ తో మిడ్ వైఫరీ డైరెక్టర్ సారా తో కల్సి సమీక్ష చేశారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ సిజేరియన్ డెలివరీ ల సంఖ్యా పెరగకుండా జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. నొప్పులు భరించలేక కొంతమంది ఇబ్బందులు పడుతున్న వారిని దష్టిలో పెట్టుకుని సహజ కాన్పులు అయ్యే విధంగా కషి చేయాలని ఆయన సూచించారు. సాధారణ కాన్పులు చేసే విధంగా శిక్షణ పొందిన వారు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అన్నారు. అనుకూలంగా కాన్పులు జరిగే విధంగా శ్రద్ధ పెట్టాలని అయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మిడ్ విఫరీ ప్రతినిధి భీమారాయ్, గైనికాల్జీ విభాగం హెచ్ ఓ డి డాక్టర్ అరుణ , మిడ్ వైఫరీ ఎడ్యుకేటర్స్ పి బేబీ, పి అపర్ణ, జి ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు అర్జీల వెల్లువ

ప్రజాశక్తి-తాడేపల్లి

ఉండవల్లి అమరావతి కరకట్టపై తన నివాసంలో నిర్వహిస్తున్న నారా లోకేష్ ప్రజాదర్బార్‌కు మంగళవారం అర్జీలు వెల్లువలా వచ్చాయి. తమ భూములు కబ్జాకు గురయ్యాయని బాధితులు వినతిపత్రం అక్కిమఇందజేశారు. 25 ఏళ్ల క్రితం ఉడా లేఅవుట్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన తమకు కనీస సదుపాయాలు కల్పించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆత్మకూరుకు చెందిన వారు అర్జీ అందజేశారు. కేన్సర్‌తో బాధపడుతున్న తన తండ్రికి పింఛను మంజూరు చేయాలని తాడేపల్లికి చెందిన ఎస్‌కె నవ్యభారతి కోరారు. టిడ్కో ఇల్లు ఇవ్వాలని ఉండవల్లికి చెందిన జయలక్ష్మి కోరారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన మంత్రి లోకేష్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వారికి హామీనిచ్చారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల

నియోజకవర్గ ప్రజల కోసం ఉండవల్లిలోని తన ఇంటి తలుపులు ఎప్పుడు తెరిచే ఉంటాయని ఏ సమస్య వచ్చినా ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని రాష్ట్ర విద్య మరియు ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. మండ లంలోని పెద్ద కొండూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ కనకపుట్టలమ్మ ఆలయాన్ని మంగళవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తనను కలవడనికి వచ్చిన ప్రజలతో మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కేశంనేని శ్రీ అనిత రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి గూడూరు వెంకటరావు, జిల్లా నాయకులు పోతినేని శ్రీనివాస్ నందం అబద్ధయ్య, పసుపులేటి శ్రీనివాసరావు, తాళ్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా గ్రూపు మహిళలకు బ్యాంకుల్లో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలి

బ్యాంకు మేనేజర్లకు ఐద్వా ప్రతినిధి బృందం వినతి

ప్రజాశక్తి - తాడేపల్లి

డ్వాక్రా పొదుపు గ్రూపు మహిళలకు బ్యాంకుల్లో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో తాడేపల్లి చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు, ఇండియన్ బ్యాంకు మేనేజర్లను వినతిపత్రాన్ని సమర్పించారు. ఐద్వా ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన సర్వేలో వచ్చిన అంశాలను బ్యాంకు మేనేజర్ల దృష్టికి తెచ్చారు. లోన్ల సందర్భంగా ప్రాసెసింగ్ ఛార్జీలు వసూలు చేయరాదని, గ్రూపు మహిళల పొదుపు సొమ్మును అవసరాలకు తీసుకోవడానికి ఆటంకాలు కల్పించరాదని, బలవంతంగా ఇన్సూరెన్స్ కట్టించరాదని వివరించారు. అవసరం అనుకుంటే తక్కువ మొత్తంలో ప్రీమియం ఉండేలా చూడాలని కోరారు. టార్గెట్‌ల కోసం ఏడాదికి ఐదు వేల కట్టాల్సిరావడం మహిళల కు భారంగా మారిందని తెలిపారు. పొదుపు డబ్బులను డిపాజిట్ చేయడం వల్ల అవసరాలకు వాడుకోవడం తగ్గిపోతుందని, దానివల్ల మహిళలు ప్రైవేట్ ఫైనాన్స్ ఉచ్చులో పడుతున్నారని తెలిపారు. మహిళా సాధికారత వ్యాపారం కారాదని కోరారు. అనేక రూపాల్లో ఆర్థికంగా నష్టపోతున్న మహిళలకు అవగాహన పెంపొందించదానికి సహకరించాలని కోరారు. ఈ మేరకు మేనేజర్లు తమ పరిధిలోని అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు దొంతిరెడ్డి శ్రీనివాస కుమారి, రాష్ట్ర కమిటి సభ్యులు ఎం. సుధ, కళ్యాణి, జ్యోతి, కె. ఉష తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికైన నూతన కార్యవర్గం

ఎపి సిపిఎస్‌ఇఎ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ సిపిఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. మంగళవారం కన్నవారితోటలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యాలయంలో జరిగిన సిపిఎస్‌ఇఎ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. షేక్.అబ్దుల్ రజాక్ ఎన్నికల అధికారిగా వ్యవహరించగా నూతన కమిటీ ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా గోపికష్ణ, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, జిల్లా కోశాధికారిగా పవన్ కుమార్, గౌరవసలహాదారుగా డాక్టర్ సుబ్బారావు, గౌరవ అధ్యక్షులుగా చావా శ్రీనివాస్, సంయుక్త అధ్యక్షులుగా నాగమణి, అదనపు ప్రధాన కార్యదర్శిగా సురేష్, జిల్లా ఉపాధ్యక్షులుగా శ్రీనివాసరావు, వివేక్, సాయిరాం, కష్ణమూర్తి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా పోలిరెడ్డి, సిద్ధూ, మధుసూదన్ రావు, జిల్లా కార్యదర్శులుగా బాల వినీత్, వెంకట్, కోటా సాహెబ్, రఘురామిరెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలుగా మాధవి, ప్రధాన కార్యదర్శిగా నాగమల్లేశ్వరి, అధికార ప్రతినిధిగా రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గోపికష్ణ మాట్లాడుతూ ప్రతి నెలా జీతం నుండి రికవరి చేసిన సిపిఎస్ మొత్తాన్ని ప్రాన్ అకౌంట్ లో జమ చేయాలని, సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ పునరుద్ధరించాలని కోరారు. ప్రధాన కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ పార్షియల్ విత్‌డ్రా చేసుకునేవిధంగా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ టోర్నీ విజేతగా యూనిక్ కాన్సెప్ట్ స్కూల్ టీం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ టోర్నమెంట్‌లో సత్తెనపల్లి పట్టణంలో యూనిక్ కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థుల టీం ప్రథమ స్థానంలో నిలిచినట్లు పాఠశాల కరస్పాండెంట్ శాఖమూరి సుజాత నారాయణ తెలిపారు. ఈ నెల రెండవ తేదీన గుంటూరు జిల్లా వెనిగండ్లలో క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నిర్వహించిన కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లాల జోన టోర్నీలో తమ విద్యార్థులు ప్రథమ స్థానాన్ని పొందారని చెప్పారు. జిల్లాస్థాయిలో విన్నర్‌గా నిలిచిన ఎస్కె అబ్దుల్ అజీమ్ (కెప్టెన్) ఆధ్వర్యంలో పోటీల్లో పాల్గొని విజయం సాధించారని విద్యార్థులతోపాటు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ అనిల్‌ను అభినందించారు.

నూతన జెసిని కలిసిన ఎమ్మెల్యే అరవిందబాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా నూతన జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సూరజ్‌ను నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మంగళవారం టిడిపి నాయకులతో వెళ్లి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పల్నాడు జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

మాచర్ల తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన జియా ఉల్ హక్

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

మాచర్ల తహశీల్ధార్‌గా జియా ఉల్ హక్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో క్రోసూరు తహశీల్ధార్‌గా ఈయన పని చేస్తు బదిలీల్లో భాగంగా మాచర్లకు వచ్చారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జ్‌ తహశీల్ధార్‌గా వ్యవహరిస్తున్న శ్రీనివాసరావు నుండి బాధ్యతలు స్వీకరించారు. నూతన తహశీల్ధార్‌ను ఆర్‌ఐ శ్రీనివాసరావు, సర్వేయర్ సాల్మన్‌రాజు, సీనియర్ అసిస్టెంట్ మస్తాన్‌వలి కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

దాచేపల్లి తహశీల్దార్‌గా కుటుంబరావు

ప్రజాశక్తి - దాచేపల్లి : నూతన తహశీల్ధార్‌గా బాధ్యతలు చేపట్టిన బి.కుటుంబరావును ఎంపిపి కె.జానా, వైస్ ఎంపిపి అబ్దుల్ సత్తార్ మంగళవారం కలిసి సత్కరించారు. మండల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

వంకా జగన్నాథరావుకు నివాళి

ప్రజాశక్తి పెదకూరపాడు : మండలంలోని 75 త్యాళ్లూరు జెడ్‌పి పాఠశాలలో పాఠశాల స్థల దాత, విద్యాభివృద్ధికి కృషి చేసిన వంకా జగన్నాథరావు వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. జగన్నాథరావు కుటుంబీకులు 'శుభదిన్ భోజన్'లో భాగంగా విద్యార్థులకు భోజనాన్ని సమకూర్చారు.పాఠశాల అభివవృద్ధికి తమ సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు.

రాజకీయ వేధింపులు, తొలగింపులను ఆపించండి

- పిడుగురాళ్లలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు అంగన్వాడీల వినతి
- దాచేపల్లిలో ఆశాల వినతిపత్రం

పిడుగురాళ్లలో సమస్యలు చెబుతున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపుల ఆపాలని కోరుతూ గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడిలు మంగళశారం వినతిపత్రం ఇచ్చారు. తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొనేందుకు పిడుగురాళ్లలోని లెనిన్ నగర్‌కు వచ్చిన ఎమ్మెల్యేను అంగన్వాడీలు కలిసి తమ సమస్యలను ఏకరువు పెట్టారు. అంగన్వాడి వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు పెరిగాయని, నాయకులు దౌర్జన్యపూరితంగా వ్యవహరిస్తున్నారని, ఇందుకు అనుగుణంగానే అధికారులు సైతం వ్యవహరిస్తున్నారని చెప్పారు. నోటీసులు, ముందస్తు సమాచారం ఏమీ లేకుండా తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చర్యల నేపథ్యంలో అంగన్వాడి, మధ్యాహ్న భోజనం, మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం మా ప్రభుత్వం పని చేస్తుందని, ఎన్నికలప్పుడు చెప్పి ఆచరణలో ఆయా వర్గాలను తొలగించడం అన్యాయమని అన్నారు. స్కీమ్ వర్కర్లంతా అర్హత ఆధారంగా ఉద్యోగాలు పొందినవారేనని గుర్తు చేశారు. ఇంకా ఎవరికైనా ఇవ్వాలనుకుంటే కొత్త ఉద్యోగాలు సృష్టించి ఇవ్వాలేగాని, ఉన్నవారిని తొలగించి కాదని అన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు షేక్ హజ్ర, డి.శాంతమణి, సెక్టార్ లీడర్లు బుజ్జి, వెంకట రావమ్మ, శివరంజని ఉన్నారు.

ప్రజాశక్తి - దాచేపల్లి

దాచేపల్లిలో వినతిపత్రం ఇస్తున్న ఆశాలు

సమ్మె సందర్భంగా ఆశా వర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, రాజకీయ వేధజంపులు ఆపాలని ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి డి.శివకుమారి, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి టి.శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు వినతిపత్రాన్ని స్థానిక ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ అమూల్యకు మంగళవారం అందించారు. శివకుమారి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఆశా వర్కర్లు ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొని పోరాడారని, ఆ సందర్భంగా ప్రభుత్వం దిగివచ్చి కొన్ని హామీలు ఇచ్చిందని గుర్తు చేశూరు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, మెడికల్, పండగ సెలవులు మంజూరు చేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రమీల, పద్మ, భూలక్ష్మి హారిక, రమాదేవి, సైదమ్మ విజయలక్ష్మి పాల్గొన్నారు.

జీతాలిచ్చేది జనమే.. గౌరవంతో మెలగండి..

అధికారులతో ఎమ్మెల్యే ప్రవీణ్ సమావేశం - తమ పార్టీవారు తప్పు చేసినా చెప్పాలని సూచన

ప్రజాశక్తి - అమరావతి

సచివాలయంలో పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

జనం చెల్లించే పన్నులతోనే మనకు జీతాలొస్తున్నాయని, వారితో అధికారులు, నాయకులు గౌరవంగా మెలగాలని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. మండలంలోని ఎనెకపాడులో అధికారులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలను ప్రభుత్వ కార్యాలయ చుట్టూ తిప్పొద్దని, ఉద్యోగస్తులపై ఫిర్యాదులు వస్తే ఉపేక్షించబోమని చెప్పారు. సమయ పాలన పాటించాలని, బాధ్యతగా పని చేయాలని కోరారు. టిడిపి వారు తప్పు చేసినా తమ దృష్టికి తేవాలన్నారు. డొంక రోడ్లు బాగు చేయడానికి ప్రణాళికను సిద్ధం చేయాలని చెప్పారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇకపై ప్రతి మూణ్ణెల్లకోసారి సమీక్షిస్తానని, రాబోయే రోజుల్లో ప్రతి గ్రామ పంచాయతి, సచివాలయాలు సందర్శిస్తానని చెప్పారు. ఇదిలా ఉండగా నియోజకవర్గంలోని పంచాయతీ కార్యదర్శులతో మండలాల వారీగా విడివిడిగా ఎమ్మెల్యే సమావేశమై పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. మండలంలోని నరుకులపాడు గ్రామ సచివాలయం, అమరావతి గ్రామపంచాయతీ సచివాలయం, ధరణికోట సచివాలయాలను సందర్శించారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో పరిశీలన

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని ఉన్నవ, ఛెంఘీస్‌ఖాన్‌పేట గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగవుతున్న పొలాలను పల్నాడు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమల కుమారి, కె.రామచంద్రం మంగళవారం పరిశీలించారు. 'ఏ' గ్రేడ్ పొలాలు, ఎటిఎం మోడల్‌ను సందర్శించిన అనంతరం అమలకుమారి మాట్లాడుతూ పత్తిలో అంతర పంటల సాగు ద్వారా రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గి నికర ఆదాయం పెరుగుతుందని చెప్పారు. సాలుకు సాలుకు మధ్యలో బెండ, గోరు చిక్కుడు, పెసర, సజ్జ, కంది తదితర పంటలేసుకోవాలని సూచించారు. రైతు జి.జ్యోతి పత్తి పొలంలో వేసిన అంతర పంటలను పరిశీలించారు. అనంతరం సొలసలోని పొలాలను సందర్శించారు.

శిశువులకు తల్లిపాలే అమృతం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

శిశువు జన్మించిన గంటలోపే ముర్రు పాలు పట్టడం వల్ల దేశంలో ఏడాదికి రెండున్నర లక్షలమంది చిన్నారుల ప్రాణాలు కాపాడొచ్చని వైద్యులు చెబుతున్నట్లు ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అధ్యక్షులు గట్టు సరోజిని అన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక లహారి పిల్లల ఆసుపత్రిలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు తల్లిపాల విశిష్టత పై అవగాహన కల్పించారు. సరోజిని మాట్లాడుతూ శిశువు సంపూర్ణ మానసిక వికాసానికి గాను రెండేండ్ల వయసు వచ్చే వరకు తల్లిపాలు తాగించడం ద్వారా శిశువులో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం ఆసుపత్రి వైద్యులు తేళ్ల సత్యంబాబు, హర్షతలకు క్లబ్ వైస్ ప్రెసిడెంట్ జాష్టి ప్రమీల ఆర్థిక సహాయంతో మంచాలను అందించారు. గర్భిణులు, బాలింతలకు క్లబ్ సభ్యులు సరస్వతి, భారతి ఆర్థిక సహకారంతో పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. క్లబ్ కార్యదర్శి జయలక్ష్మి, టి.రమాదేవి, పి.పద్మావతి, డి.రమాదేవి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

సిడిపిఒ ఎం.అనురాధ ఆధ్వర్యంలో అయినవోలులో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు తల్లిపాల గురించి, కిశోర బాలికలకు బాల్య వివాహాలు వల్ల నష్టాల గురించి వివరించారు. ప్రతినెలా గ్రామానికి వచ్చే ప్రభుత్వ వైద్యశాలకు చెందిన 104 వాహనం ద్వారా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ప్రాజెక్ట్ సూపర్వైజర్ ఎం.నాగరాజుకుమారి డాక్టర్ ఎస్కె వహీదా రజాక్, జి.చరిష్మా, ఎన్.జ్యోతి వి.సురేష్, వి.రామకృష్ణ, పి.భార్గవి, బి.లక్ష్మీప్రియ, ఎం.మేరమ్మ పాల్గొన్నారు.

అమీన్‌సాహెబ్‌పాలెంలో కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి - నాదెండ్ల

మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెంలో నరసరావుపేట ఎంవి రెడ్డి కంటి హాస్పిటల్ డాక్టర్ దిలీప్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య నిర్వహించారు. 65 మందికి పరీక్షలు చేసి 28 మందికి శుక్లాలు ఉన్నట్లు గుర్తించారు. కళ్లజోళ్లు అవసరమైన వారికి 30 శాతం తగ్గింపు ధరతో ఇస్తామని తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి గుర్రం నాగపూర్ణ చంద్రరావు తెలిపారు.

వికలాంగుల హక్కులపై న్యాయపరమైన అవగాహన అవసరం : న్యాయమూర్తి

ప్రజాశక్తి - మాచర్ల

వికలాంగుల హక్కుల గురించి వారికి, వారి కుటుంబ సభ్యులకు న్యాయపరమైన అవగాహన అవసరమని న్యాయమూర్తి శ్రీనివాస్ కళ్యాణ్ అన్నారు. స్థానిక సూర్యకిరణ్ మానసిక పాఠశాలలో మంగళవారం ఉదయం వికలాంగులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. న్యాయమూర్తి శ్రీనివాస్ కళ్యాణ్ మాట్లాడుతూ వికలాంగులకు ప్రభుత్వం కల్పించే సదుపాయాల పట్ల అవగాహన ఉండలాన్నారు. వారికి అవసరమైన వైద్య సదుపాయం అందుబాటులో ఉంచాలని పాఠశాల యజమాన్యాన్ని ఆదేశించారు. అనంతరం పి.మణికుమార్ తన పుట్టినరోజు సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులకు భోజనం సమకూర్చారు. కార్యక్రమంలో న్యాయవాదులు బి.అనిల్‌కుమార్, జి.వరప్రసాద్ పాల్గొన్నారు.

ఆంధ్రాప్యారిస్‌లో దొంగలు బాబోయ్...దొంగలు..

- పట్టణంలో రోజుల వ్యవధిలో వరుస చోరీలు.. దాడులు కూడా
- బెంబేలెత్తుతున్న స్థానికులు

ప్రజాశక్తి-తెనాలి

పట్టణంలో దొంగల హల్ చల్ పెరిగింది. భారీ దొంగతనాలకు పాల్పడుతున్నారు. తాళం వేసి ఉన్న ఇళ్ళతో పాటు షోరూమ్ ల్లో కూడా దొంగతనాలకు వెనుకాడటంలేదు. ఆ దొంగతనాలు కూడా భారీ మొత్తంలోనే. పోలీసుల నిఘా వైఫల్యమో, దొంగలు తెలివి మీరిపోయారో తెలియదు కాని వరుసగా నాలుగైదు ఘటనలు పట్టణ త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరగటం ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తుంది.

మార్గ్ అపార్ట్‌మెంట్‌లో దొంగలు విడిచి వెళ్ళిన వెండి వస్తువులు (ఫైల్‌ఫోటో)

పట్టణ త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వరుసగా దొంగతనాలు జరుగుతున్నాయి. రెండు రోజుల క్రితం చెంచుపేట మార్గ్ అపార్ట్‌మెంట్‌లో తాళం వేసి ఉన్న ప్లాట్‌లో దొంగతనం జరిగిన సంగతి తెలసిందే. ఇంటిలో నివాసం ఉండే మహిళ స్థానికంగా అందుబాటులో లేకపోవటం, పక్క ప్లాటు వారు గమనించి పిర్యాదు చేయటంలో పోలీసులు కేసు నమోదు చేయటం జరిగింది. పెద్దమొత్తంలో బంగారం పోయినట్లు వినికిడి. పోలీసులు మాత్రం కేవలం 100గ్రాముల బంగారమేనని చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఈనెల 5న మరో రెండు దొంగతనాలు వెలుగు చూశాయి. మారీసుపేటలో ఓ టైర్ల షోరూమ్‌లో ప్రవేశించిన దొంగలు రూ.2.50లక్షల నగదును అపహరించారు. శనివారం షోరూమ్‌కు తాళం వేసి వెళ్ళిన నిర్వాహకులు ఆదివారం శలవు కావటంతో సోమవారం షాపు ఓపెన్ చేసి, దొంగతనం జరిగినట్లు గుర్తించారు. శనివారం రాత్రే దొంగతనం జరిగినట్లు సిసి టివి పుటేజి ద్వారా నిర్ధారించి, పోలీసులక సమాచారం ఇచ్చారు. అలాగే చెంచుపేట ప్రజాసంఘాల కార్యాలయం సమీపంలో విద్యుత్ శాఖ ఉద్యోగి సంపూర్ణ శాంతకుమారి నివాసం ఉంటున్నారు. సోమవారం తమ కుమార్తె వేరే ప్రాంతానికి వెళ్ళాల్సి ఉండగా, ఆమె కోసం తెల్లవారుజామున మూడు గంటలకు లేచి వంట ముగించి, ఆమెను బస్సుకు పంపి ఇంటికి వచ్చేలోగా ఇంట్లో ఉన్న గోల్డ్ బాక్స్ అపహరణకు గురైనట్లు గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు మాత్రం వివరాలు వెల్లడించటంలో కూడా గోప్యత పాటిస్తున్నారు.

నిందితులు దొంగతనానికి ఉపాయోగించిన ఆయుధాలు (ఫైల్‌ఫోటో)

వరుస చోరీలతో ప్రజల్లో భయాందోళనలు

పట్టణ త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోనే కొద్ది రోజుల వ్యవధిలో వరుసగా దొంగతనాలు, దారి దోపిడి, దాడులు జరగటం స్థానికులను ఆందోళనకు గురిచేస్తుంది. పై తెలిపిన దొంగతనాలకు తోడు ఇటీవలి కాలంలో ఓ వృద్ధుడు సంచి చేతపట్టుకుని నడిచి ఫ్లైఓవర్‌పై వెళుతుండగా, వెనుకనుంచి బైక్‌పై వచ్చిన దుండగులు అతని చేతిలో సంచి లాక్కుని పరారర్యారు. వృద్ధుడు కిందపడి తృటిలో ప్రాణాపాయం తప్పించుకున్నాడని స్థానికులు చెబుతున్నారు. అలాగే రైల్వే స్టేషన్‌లో ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ఘటన కూడా త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోనే జరిగింది. దీంతో దొంగలు తెలివిమీరి పోయారా, పోలీసుల గస్తీ కరువైందా అన్న సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నేరనియంత్రణకు పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులతో లైన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ బృందం

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన లైన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ ఆధ్వర్యంలో మంగళవారం అయితానగర్ డగ్లస్ మెమోరియల్ రెసిడెన్షియల్ ఎలిమెంటరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులకు లాంగ్ నోట్ బుక్స్, పెన్నులు, పలకలు అందించారు. క్లబ్ సభ్యులు కిక్కారి చిన్ని కష్ణా రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా కార్యక్రమం నిర్వహించినట్లు క్లబ్ వ్యవస్థాపకులు కాకరపర్తి సుబ్రమణ్యం తెలిపారు. ఈ సందర్భంగా చిన్ని కష్ణారెడ్డి మాట్లాడుతూ క్లబ్ తరపున చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో కేరళలోని వయనాడ్ వరద బాధితులకు ఆర్థిక సాయం అందించటం కూడా హర్షనీ యమన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పి వెంకటే శ్వరరావు, అయినాల మల్లేశ్వరరావు, ఎం వి రఘునాథ రావు, కె రమేష్ కృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయిని సిహెచ్ స్వర్ణలత, ఉపాధ్యాయులు ఎ సుజాత, కరస్పాండెంట్ ఎస్ లతా కుమారి, డి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

యోగా ఇన్‌స్ట్రక్షన్స్ పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వ్యాయామ విద్య క్రీడా శాస్త్రాల కళాశాలలోని యోగ విభాగంలో అధ్యాపకులుగా పనిచేస్తున్న డాక్టర్ కాశీభట్ట సత్యమూర్తి రచించిన యోగ ఇన్‌స్ట్రక్షన్ అనే పుస్తకాన్ని మంగళవారం విశ్వవిద్యాలయ ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత సత్యమూర్తిని అభినందించారు. యోగ విద్యకు రోజురోజుకు ఆదరణ పెరుగుతున్న కారణంగా యోగ ఇన్‌స్ట్రక్చర్స్ యోగాలో శిక్షణ ఇవ్వడం అనే ధోరణి విస్తరిస్తుందన్నారు. అయితే ఇది కేవలం శారీరక వ్యాయామం లాగా కాకుండా దేహము మనస్సు సమన్వయాన్ని సాధించేలా విద్యార్థులు యోగ అభ్యసించాలనేది అధ్యాపకులు సూచిస్తూ ఉంటారన్నారు. యోగా ఇన్ స్ట్రక్షన్ అనే పుస్తకం అధ్యాపకులకు ఒక టీచింగ్ మాన్యువల్ గా ఉపకరించగలదని పేర్కొన్నారు. తరగతి గదిలో బోధనతోపాటు ప్రాక్టికల్స్ విషయంలో తీసుకోవలసిన పలు సాంకేతికమైన జాగ్రత్తలు ఇందులో పొందుపరచడం

గమనార్హమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ రెక్టార్ ప్రొఫెసర్ కె. రత్న షీలా మణి, ఇన్ చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. సింహాచలం, డిస్టెన్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి. వెంకటేశ్వర్లు, వ్యాయామ కళాశాల యోగ కోఆర్డినేటర్ డాక్టర్ డి . సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు ఆవుల తరలింపు

ప్రజాశక్తి - మంగళగిరి : మంగళగిరి పట్నంలోని గౌతమ బుద్ధా రోడ్డుపై విచ్చలవిడిగా సంచరిస్తున్న ఆవులు పట్టివేతకు నగరపాలక సంస్థ అధికారులు ఎట్టకేలకు శ్రీకారం చుట్టారు. ఇటీవల గౌతమ బుద్ధ రోడ్డుపై పడుకుని ఉన్న ఆవులను గమనించని ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనదారుని తో పాటు వెనుకనే కూర్చుని ఉన్న మరో యువకుడు సైతం తీవ్ర గాయాల పాలై మృతి చెందిన విషయం విదితమే. ఇద్దరు యువకుల ప్రాణాలు గాల్లో కలవడంతో నగర పాలక సంస్థ అధికారులు ఎట్టకేలకు నిద్ర మేల్కొని విచ్చలవిడిగా సంచరిస్తున్న ఆవుల కట్టడికి చర్యలు చేపట్టారు. మంగళవారం గౌతమ్ బుద్ధ రోడ్డుపై సంచరిస్తున్న ఆవులను పట్టి ట్రాక్టర్లో నగర పరిధిలోని యర్రబాలెం గోశాలకు తరలించారు. రోడ్డుపై ఆవులను వదిలివేస్తే ఇక ఉపేక్షించే ప్రసక్తే లేదని, వాటి యజమానులపై చట్టపరంగా చర్యలు తప్పవని నగరపాలక సంస్థ అధికారులు హెచ్చరించారు.

డేంజరస్ జోన్‌లో ప్రమాదాల నివారణ చర్యలేవి?

ప్రజాశక్తి-మంగళగిరి : మంగళగిరి లోనే కాళీమాత ఆలయం ఎదురుగా గల కూడలి ఇది. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. స్నేహితుడు దినోత్సవం నాడు ఈ ఘటన విషాదాన్ని మిగిల్చింది..

ఇక్కడ తరచూ ఏదో ఒక ప్రమాదం చోటు చేసుకుంటూనే ఉంది. ఈ ప్రాంతాన్ని డేంజరస్ జోన్‌గా గతంలో అధికారులు గుర్తించారు. అయితే ఇక్కడ డివైడర్‌ను తీసివేసి ఓపెన్ చేసినప్పటికీ ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు, స్టాప్ బోర్డుల ఏర్పాటు వంటి వాటిపై దృష్టి పెట్టలేదు. ఆర్ అండ్ బి, పోలీస్, నగరపాలక సంస్థ అధికారులు సమన్వయంతో దృష్టి పెట్టి చర్యలకు ఉపక్రమించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రధాన డ్రెయిన్లలో పూడిక తీత

ప్రజాశక్తి-మంగళగిరి : మంగళగిరి పట్టణంలోని రత్నాల చెరువు12, 13 సచి వాలయ పరిధిలో గల జాతీయ రహదారి ప్రక్కన మంగళవారం కార్పొరేషన్ అధికారులు జెసిబి తో పూడికతీత పనులు చేపట్టారు. ప్రజల నుండి ఫిర్యాదులు రావడంతో ఈ చర్యలు చేపట్టినట్లుగా అధికారులు తెలిపారు. వెంటనే స్పందించి ప్రజలకు ఉపయోగపడే విధంగా కాలువలో మురుగును తొలగించడం జరిగింది. నగర ప్రజలు ఏవైనా పారిశుధ్య సమస్యల పరిష్కార చర్యల కొరకు నగర పాలక సంస్థ వారు ఏర్పాటు చేసిన ప్రత్యేక కాల్ సెంటర్ (7093912653, 08645-295192) నెంబర్లకు సమాచారం తెలిపిన యెడల తగు పరిష్కార చర్యలు చేపట్టడం జరుగుతుందని అధికారులు తెలిపారు.

మంగళగిరి శివాలయంలో లక్ష కుంకుమార్చన

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరిలో పట్టణంలో వేంచేసియున్న శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రావణమాసం తొలి మంగళ వారంను పురస్కరించుకుని మంగళ గౌరీ సహిత జ్ఞాన సరస్వతి కనకమహాలక్ష్మి దేవిఅమ్మవార్లకు ధార్మిక లక్ష కుంకు మార్చన కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ అర్చక పర్యవేక్షక పురోహితులు తెలిదేవరపల్లి శ్యామసుందర శాస్త్రి తెలిపారు. మంగళవారం 28వ వార్షికోత్సవం సందర్భంగా శివాలయం ప్రధాన అర్చకులు మహేష్ కుమార్ శర్మ బ్రహ్మత్వంలో శాస్త్రీయ పద్ధతిలో జరిపిన లక్ష కుంకుమార్చనలో సుమారు 16వందల 40 మంది మహిళలు పాల్గొన్నట్లు తెలిపారు. పూజలో పాల్గొన్న మహిళలకు లక్ష్మీ కుబేర ప్రతిమ డాలర్, రూపు, రక్షా తాళ్ళను ఉచితంగా అందజేశామని తెలిపారు.

వేతనాల చెల్లింపులో ఆలస్యంపై డ్వామా పీడీ ఆగ్రహం

ప్రజాశక్తి - దుగ్గిరాల

ఉపాధి హామీ కూలీలకు వేతనాలు ఆలస్యంగా అందటం పట్ల డ్వామా పిడి ఉమాదేవి మండల అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం జరిగిన 2023 - 24 సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రూ.8 కోట్లతో 1400 పనులు చేపట్టినట్లు తెలిపారు. ఉపాధి హామీ సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని ప్రభుత్వ యంత్రాంగానికి తప్ప ఎవరికి తెలియకుండా అత్యంత రహస్యంగా నిర్వహించారు. కార్యక్రమంలో డిసిఒ విజయలక్ష్మి ఏపీ డి బాలమ్మ అంబుడ్స్ మెన్ కౌముది డిపిఓ కుసుమ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సభ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

సుప్రీం కోర్టు వెలువడించిన ఎస్సి వర్గీకరణ తీర్పును ఉద్యమాల్లో అశువులు బాసిన అమరవీరులకు అంకితమిస్తున్నట్లు మాదిగ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్య అన్నారు. ఎమ్మార్పీఎస్ గుంటూరు జిల్లా అధ్యక్షులు కిన్నెర నాగరాజు మాదిగ ఆధ్వర్యంలో మంగళవారం కొత్తపేట యన్జిఓ కళ్యాణ మండపంలో జరిగిన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నిర్వహించిన గుంటూరు జిల్లా సమీక్ష సమావేశంలో బ్రహ్మయ్య మాదిగ ముఖ్య అతిధిగా పాల్గున్నారు. తొలుత కారంచేడు, చుండూరు ఘటనల్లో అశువులు బాసిన అమరవీరులకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం బ్రహ్మయ్య మాట్లాడుతూ 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటాలు అనంతరం ఎస్సి వర్గీకరణకు అనుగుణంగా వచ్చిన కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. ఈసందర్భంగా కారంచేడు, చుండూరులో జరిగిన మారణహోమంలో అశువులు బాసిన అమరవీరులకు ఈ విజయాన్ని అంకితం చేస్తున్నామన్నారు. సుప్రీం కోర్టు వెలువడించిన తీర్పును వెంటనే అమలు పరచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్గీకరణ విషయంపై మాలలు కూడా సుప్రీం కోర్టుకు వెళ్లే అవకాశం ఉన్నందున పార్లమెంటులో చట్టంచేసి తమ చిత్తశుద్ధిని నిరూపింవహుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. పార్లమెంటులో చట్టం చేస్తేనే వర్గీకరణ కు శాశ్వత పరిష్కారం దొరుకుతుందన్నారు. సుప్రీంకోర్టులో తీర్పును వెలువడించిన ఏడుగురు న్యాయమూర్తులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎమ్మార్పీఎస్ నాయకులు కోమరాల శ్రీనివాసరావు, చిలువూరు నాగరాజు, ఏటుకూరి విజయ్ కుమార్, మానికొండ శ్రీధర్, లంక బుజ్జి, గౌరి, కె గరటయ్య, మాతంగి ఓదేలు తదితరులు పాల్గొన్నారు.

వల్లభాపురం నాగేశ్వరరావు మృతి

ప్రజాశక్తి-తాడేపల్లి

సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు వల్లభాపురం వెంకటేశ్వరరావు సోదరుడు వల్లభాపురం నాగేశ్వరరావు (76) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. సాంబశివరావు మృతదేహాన్ని సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, తాడేపల్లి రూరల్ కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, రాజధాని రైతు సంఘం కార్యదర్శి కె.ఈశ్వరరెడ్డి, రాజధాని సిఐటియు నాయకులు ఎం.భాగ్యరాజు, ఎస్‌కె పీరూసాహెబ్, పి.వీరాస్వామి సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

వెలగపూడి విఆర్ఏ కన్నుమూత

ప్రజాశక్తి - తుళ్లూరు

వెలగపూడి గ్రామ రెవెన్యూ సహాయకులు (వి ఆర్ ఎ), వి ఆర్ ఎ ల సంఘం మాజీ అధ్యక్షులు తురకా అమృతరావు (80) సోమవారం రాత్రి గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన మృతికి విఆర్ఎలు సంతాపం తెలిపారు.వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

పెనుమాక హెచ్‌ఎంకు డాక్టరేట్

వి. పూర్ణచంద్రశేఖరరావు

ప్రజాశక్తి-తాడేపల్లి

పెనుమాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న వింజమూరి పూర్ణచంద్రశేఖరరావుకు శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం మంగళవారం డాక్టరేట్ ప్రకటించింది. 'కాట్రగడ్డ దయానంద్ సాహిత్యం - పరిశీలన' అనే అంశంపై పరిశోధన చేసినందు కుగాను చంద్రశేఖరరావుకు పిహెచ్‌డి ప్రకటించారు. పూర్ణచంద్రశేఖరరావు పిల్లల్లో భాషా జ్ఞానం పెంపొందించడం, పిల్లలకు వివిధ రకాల పోటీలను పెట్టి బహుమతులను అందిస్తూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమానికి పాఠశాల మొదటి సహాయకులు సిహెచ్‌వి రాధాకృష్ణ అధ్యక్షత వహించి పూర్ణచంద్రశేఖరరావు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ షేక్ మహబూబ్ సుభాని పిటిఎ కో ఆప్షన్ సభ్యులు మేకా దామేశ్వరరెడ్డి, బొక్కా నాని, గ్రామ పెద్దలు మేకా మోహన్‌రెడ్డి, మేకా గోపాలకృష్ణ, మేకా గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవాలకు ఎఎన్‌యు విద్యార్థులు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

15న న్యూఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగే భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఇన్చార్జి కోఆర్డినేటర్ డాక్టర్ వి. దివ్య తేజో మూర్తి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి 20 మంది విద్యార్థులు పాల్గొంటున్నారని, వారిలో వర్సిటీ విద్యార్థులు ఇద్దరున్నారని తెలిపారు. వర్సిటీ పరిధిలోని నిర్మల ఫార్మసీ అనుబంధ కళాశాల జాతీయ సేవా పథకం విభాగం నుండి బీఫార్మసీ చదువుతున్న బుర్ర దివ్యశ్రీ, ఫార్మా డీ చదువుతున్న ఎస్. రేవంత్ సాయి ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు ఇరువురు విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సేవా పథకం విద్యార్థులు సేవ తత్పరతతో స్వపేక్ష ,స్వలాభం లేకుండా దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో సామాజిక అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొని ఉన్నత శిఖరాలను అధిరోహించి యూనివర్సిటీ గర్వించే విధంగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం వారిని సత్కరించారు. కార్యక్రమంలో ఇన్చార్జి రెక్టర్ ప్రొఫెసర్ కె. రత్న షీలా మణి, ఇన్చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. సింహాచలం, ఇన్చార్జి ఓఎస్డి ఆర్ వి ఎస్ ఎస్ ఎన్. రవికుమార్, డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ఇన్చార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ వి. వెంకటేశ్వర్లు నిర్మల ఫార్మసీ కళాశాల ప్రోగ్రాం ఆఫీసర్ రేఖా నరేష్ బాబు, నరసింహ నాయక్, ఎన్ఎస్ఎస్ సిబ్బంది జి. వెంకటేశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు.

యూజీసీ కో-ఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ అశోక్ కుమార్ నియామకం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో యుజిసి విభాగం కోఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ వై. అశోక్ కుమార్ (అంబేద్కర్ చైర్) నియమితులయ్యారు . ఈ మేరకు మంగళవారం ఇంచార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు, ఇన్చార్జి రెక్టర్ ప్రొఫెసర్ రత్న షీలా మణి, ఇన్చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. సింహాచలంలు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభా కాంక్షలు తెలియజేశారు. అనంతరం అశోక్ కుమార్ మాట్లడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన వీసీ ప్రొఫెసర్ గంగాధర రావు, రెక్టర్, రిజిస్ట్రార్ లకు ధన్యవాదాలు తెలియజేశారు. తన వంతు సహకారం అందించి వర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

జిఎంసి వాహనాలు కండీషన్‌లో ఉంచాలి

వెహికిల్‌షెడ్ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

నగరపాలక సంస్థకు చెందిన వాహనాలు అన్నీ కండ షన్‌లో ఉండాలని, వాహనాల స్థితిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని నగర కమిషనర్ (ఎఫ్ఎసి) ఎస్.హరికృష్ణ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ స్థానిక కెవిపి కాలనీలోని జిఎంసి వెహికిల్ షెడ్‌ని, ఏటుకూరు రోడ్డులోని కంపోస్ట్ యార్డ్, వర్మి కంపోస్ట్ యూనిట్, చుట్టగుంట జంక్షన్, జిటి రోడ్, శ్రీనివాసరావుతోట తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. వెహికిల్ షెడ్‌లో ప్రస్తుతం ఉన్న వాహనాలు, వాటిలో మరమ్మతులకు గురైనవాటి, వినియోగంలో లేని వాహనాల వివరాలు అడిగి తెలుసుకొని, ప్రతి వాహనం కండీషన్‌లో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మరమ్మతులకు గురైన వాహనాలను వెంటనే మరమ్మతు చేసేలా చూడాలన్నారు. అలాగే ప్రతి వాహనానికి జిపిఎస్ ఉండాలన్నారు. ఏటుకూరు రోడ్డులోని కంపోస్ట్ యార్డ్‌ను పరిశీలించి, నగరంలో నుండి వచ్చిన చెత్తను డంప్ చేయడం జరుగుతుందని యార్డ్‌లో కన్వేయర్ బెల్ట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఏఈని ఆదేశించారు. వర్మి కంపోస్ట్ యూనిట్‌ని పరిశీలించి యూనిట్ పరిమాణం పెంచాలని, నగరంలోని నగరపాలక సంస్థ పార్కుల్లో ఎరువుని వినియోగించడానికి సరిపడా సిద్ధం చేయాలన్నారు. పర్యటనలో ఎంహెచ్‌ఓ మధుసూదన్, వెహికిల్ షెడ్ డిఈఈ శ్రీధర్, ఎస్.ఎస్. ఆనంద కుమార్, ఏఈ రవికిరణ్, శానిటరీ ఇన్స్పెక్టర్లు రత్నం, ఏడు కొండలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వందరోజుల కార్యక్రమంపై కార్యాచరణ ప్రణాళిక

గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ప్రభుత్వ వందరోజుల కార్యక్రమానికి జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో అమలు చేసే పథకాలు, కార్యక్రమాలపై కార్యచరణ ప్రణాళికను బుధవారం నాటికి అందించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ తేజతో కలసి ముఖ్యమంత్రి నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో వివిధ శాఖలకు సంబంధించి చర్చించిన అంశాలపై అందించిన సూచనల అమలుపై కలెక్టర్ జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా విజన్ ప్లాన్‌కు సంబంధించి శాఖలవారీగా ఇన్నోవేషన్ కార్యక్రమాలపై అధికారులు ప్రతిపాదనలు అందించాలన్నారు. భూములన్నింటినీ సాగులోకి తెచ్చేందుకు సాగు చేయని వ్యవసాయ భూముల వివరాలు సేకరించాలన్నారు. సీసీఆర్సీ కార్డుదారులందరికీ రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయం, ఉద్యాన పంటలు, పశువులకు వ్యాక్సిన్, గొర్రెలు, మేకల పెంపకం, ఉపాధి హామీ తదితర అంశాలపై సమీక్షించి తగు సూచనలు చేశారు. ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టు ఏర్పాటును ప్రోత్సహించాలన్నారు. సాగు నీటికి సంబంధించి ఇరిగేషన్ కెనాల్స్ మరమ్మతు, ఆధునీకరణ, మెయిన్టెన్స్ పై పూర్తి ప్రతిపాదనలు అందించాలన్నారు. నిత్యవసర సరుకుల ధరలపై లీగల్ మెట్రాలజీ, సివిల్ సప్లయిస్ అధికారులు పర్యవేక్షించాలని, అధిక ధరలకు విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల ఫ్రీ హోల్డ్ చేసిన డాటెడ్, అసైన్డ్ భూముల రికార్డులను జిల్లాలోని ఒక మండలంలో రెవెన్యూ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు సంయుక్తంగా పరిశీలన చేసి నివేదిక అందించాలన్నారు. రెవెన్యూ ఫిర్యాదులు ఎక్కువుగా వస్తున్న మండలాల్లో డివిజన్ స్థాయి అధికారులు ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలన్నారు. హాస్టల్ విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచాలన్నారు. మైనార్టీలకు చెందిన స్థలాలను పూర్తి స్థాయిలో సర్వే చేసి ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రెడిమెడ్ గార్మెంట్స్ తయారీ, అమ్మకాలపై నిర్మిస్తున్న క్యాపిటల్ బిజినెస్ పార్కు పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. బడి బయట పిల్లలను గుర్తించి తిరిగి పాఠశాలలో చేర్పించటంపై కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించేలా, విద్యార్థులందరూ మధ్యాహ్న భోజనం తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు వైద్యారోగ్యశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా మైనర్ గర్భిణీలు నమోదు అవుతున్న ప్రాంతాల్లో ప్రత్యేకంగా అనాలసిస్ చేసి ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలను చేపట్టాలన్నారు. అన్నా క్యాంటీన్లు ఆగస్టు 15వ తేదికి ప్రారంభించేలా భవనాల మరమ్మత్తులు పూర్తి చేయాలన్నారు. పీపీపీ విధానంలో రహదారుల నిర్వహణకు ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు. సమావేశంలో డిఆర్ఓ పెద్ది రోజా, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వయనాడ్ బాధితుల కోసం విరాళాల సేకరణ

తుళ్లూరులో

కొలనుకొండలో

పొనుగుపాడులో

దుగ్గిరాలలో

గుంటూరులో

ప్రజాశక్తి-గుంటూరు

కేరళలోని వయనాడ్ ప్రాంతంలో కొండ చరియలు విరిగిపడిన ఘటనలో బాధితులను ఆదుకోవటానికి సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక గుజ్జనగుండ్ల సెంటర్‌లో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సిఐటియు గుంటూరు నగర పశ్చిమ ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు మాట్లాడుతూ వయనాడ్ ఘటనలో 400మందికిపైగా మరణించారన్నారు. అనేక మంది నిరాశ్రయులు అయ్యారన్నారు. బాధితులను ఆదు కోవటానికి ప్రతి ఒక్కరూ మానవతా దృక్పదంతో ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.సత్యనారాయణ, షేక్.మస్తాన్‌వలి, కె.శివయ్య, షేక్.ఖాసింవలి, పి.శ్రీనివాసరావు, డి.కోటేశ్వరరావు, కె.భాగ్యరాజు పాల్గొన్నారు.

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్ : ఇటీవల కేరళ రాష్ట్రంలో కొండ చరియలు విరిగిపడి మృతి చెందిన వందల మంది బాధితుల కుటుంబాలు నిరాశ్రయులయ్యారని సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు అన్నారు. మంగళవారం ఏంటీఎంసీ పరిధిలోని కొలను కొండ గ్రామంలో కేరళ బాధితుల కోసం నిధి వసూలు కార్యక్రమాన్ని సిపిఎం నాయకులు చేపట్టారు. ప్రతి ఒక్కరూ మానవ దక్పథంతో సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిపిఎం తాడేపల్లి రూరల్ కార్యదర్శి దొంతి రెడ్డి వెంకట్ రెడ్డి, సిపిఎం నాయకులు కాట్రగడ్డ శివరామ కృష్ణయ్య, కాట్రగడ్డ శివన్నారాయణ, నాగపోగు విజయరాజు, గుడిసె శ్రీనివాసరావు, అమ్మిశెట్టి రంగారావు, అమ్మిశెట్టి సుధాకర్ పాల్గొన్నారు.

ఫిరంగిపురం: పొనుగుపాడు గ్రామంలో వాయనాడ్ వరద బాధితుల సహాయార్థం సిపిఎం నాయకులు బి శ్రీనివాసరావు, ఎస్ఎం వలి, కె కోటేశ్వరరావు, బ్రహ్మయ్య విరాళాలు వసూలు చేశారు.

ప్రజాశక్తి - తుళ్లూరు : కష్టాల్లో ఉన్న కేరళ రాష్ట్రంలోని వాయనాడ్ ప్రజల సహాయార్థం సిఐటియు రాజధాని డివిజన్ కమిటీ మంగళవారం విరాళాల సేకరణ చేపట్టింది. రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరులో ప్రధాన వీధులలో వ్యాపార సంస్థలు, సామాన్య ప్రజల వద్ద జోలె పట్టి సాయం అర్థించారు. ప్రజలనుంచి ఆదరణ లభించింది. ఆపదలో ఉన్న తోటివారికి సాయం చేయాలని తమ శక్తి మేరకు విరాళాలు అందించారు.కార్యక్రమంలో సిఐటియు రాజధాని డివిజన్ కమిటీ కార్యదర్శి ఎం భాగ్యరాజు నాయకులు పేరం బాబురావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల : దుగ్గిరాలలో సిపిఎం ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. స్థానిక గ్యాస్ కంపెనీ నుండి పోస్ట్ ఆఫీస్ వరకు ప్రధాన రహదారిలో విరా ళాల సేకరణలో సిపిఎం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు, నాయకులు ఎన్ యోగేశ్వరరావు వైబ్రేశ్వర రావు సిహెచ్ పోతు రాజు బి అమ్మిరెడ్డి పాల్గొన్నారు.